తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 13.05.2026 | సంపుటి : 12 సంచిక : 293 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్
Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




మోడీ పర్యటన

## తెలంగాణ బీజేపీ నేతల నారాజ్



ప్రధాని పర్యటనలో చంద్రబాబు, పవన్‌లకు ప్రాధాన్యత

తెలంగాణ బీజేపీ నేతలకు పెద్దగా దక్కనిచోటు

అక్కడి పార్టీలకు ఇక్కడేం పనంటూ అసహనం

కార్పొరేట్ ఆసుపత్రి ప్రారంభంపైనా విమర్శల వెల్లువ

**ఇంట్లో ఈగల మోత.. బయట పల్లకి మోత అన్నట్టుగా మారింది బీజేపీ తీరు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన పలు వివాదాలకు తెరతీసింది. సొంత పార్టీ నాయకులను పక్కనపెట్టి మిత్రపక్షాలకు పట్టం కట్టడం, ప్రభుత్వ రంగ ఆసుపత్రిని వదిలి ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్‌కు రెడ్ కార్పెట్ పరవడం.. ఇవన్నీ కలిసి బీజేపీ అంతర్గత వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసినట్లు సమాచారం.**

హైదరాబాద్, మే 12 (జనంసాక్షి) : మోడీ తెలంగాణ పర్యటనలో రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి పెద్దగా చోటు దక్కలేదు. బదులుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ నేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లతో ప్రధాని భేటీ అవడం తెలంగాణ బీజేపీ నేతల్లో పెదవి విరుపునకు కారణమైంది. "తెలంగాణలో వారికేం పని? తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసే అంశాలపై దృష్టి పెట్టాల్సింది పోయి, ఇక్కడ ప్రాధాన్యత లేని పార్టీలకు వేదిక కల్పించడం ఏమిటి?" అని బీజేపీ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

**ఎయిమ్స్ మర్చిపోయి.. కార్పొరేట్‌కు స్వాగతం!**

తెలంగాణ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ ఎయిమ్స్ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోయినా, మిగతా 2లో..





తెలంగాణ పర్యటన సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన ప్రధాని మోదీ



# 'నీట్' రద్దు

## పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టీఏ నిర్ణయం

త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని ప్రకటన • సీబీఐ విచారణకు ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి): జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకు న్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని మిగతా 2లో..

విద్యార్థులకు శాపంగా ఎన్డీఏ వైఫల్యం: కేటీఆర్ 2 లో..

### లక్షలాది మంది విద్యార్థుల ఆశలపై నీళ్లు



ప్రధాని 'అమృత్ కాలం'.. దేశానికి విషయుగంలా మారింది

- నీట్ పరీక్ష రద్దుపై రాహుల్ ఆగ్రహం
- నీట్ వ్యవస్థే ఓ పెద్ద స్కామ్: స్టాలిన్
- నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత
- సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్- యూజీ పేపర్ లీక్ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో ఈ నెల 3న జరిగిన పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాజాగా మిగతా 2లో..

## మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి
- కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి
- అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి):మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా మిగతా 2లో..



### బండి భగీరథ్‌కు పోక్సో కేసులో తాఖీదులు



- బుధవారం పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో విచారణకు హాజరుకావాలని నోటీసులు
- హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్
- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

కరీంనగర్(జనంసాక్షి): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు పేట్‌బషీరాబాద్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. పోక్సో కేసులో బుధవారం మధ్యాహ్నం పీఎస్‌లో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని భగీరథ్ ఇంటికి పోలీసులు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.తన కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నారంటూ ఓ బాలిక (17) తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌పై సెక్షన్ 11 రెడ్‌విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. మరోవైపు బాలిక తోపాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం తనను బెదిరిస్తున్నారని అదే రోజు భగీరథ్ కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదైంది.ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు పర్యవేక్షణ అధికారి మిగతా 2లో..

నా కుమారుడిని నేరస్థుడిగా చూపేందుకు **కుట్ర**

- చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా..
- కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం
- కుమారుడి పోక్సో కేసుపై స్పందించిన బండి సంజయ్

2 లో..

'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ నాయకులు **స్పందించరేం?**

పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవు : మహేశ్ కుమార్ గౌడ్





## నిలువునా చీలిన రెండాకులు

విజయ్‌కు మద్దతు తెలిపిన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

రెబల్స్‌తో సీఎం విజయ్ భేటీ

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన దగ్గరి నుంచి అక్కడి రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని రోజులుగా జరుగుతోన్న ప్రచారానికి తగ్గట్టే అన్నాడీఎంకే చీలిపోయింది. ఆ పార్టీ సీనియర్ నేత సీవీ షణ్ముగం నేతృత్వంలో కొందరు నేతలు అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి, సీఎం విజయ్‌కు మద్దతు ప్రకటించారు. కొన్నేళ్లుగా మిగతా 2లో..

### తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం

బడులు, గుడులు,బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత

2 వారాల్లో మూసేయాలంటూ ఆదేశాలు 2 లో..



## తెలంగాణకు 16, ఏపీ 10 టీఎంసీలు

కృష్ణా జలాల వినియోగంపై కేఆర్ఎంబీ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

### తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

హైదరాబాద్(జనంసాక్షి):మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఝార్ఖండ్‌లోని సరండా ఫారెస్ట్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మిగతా 9లో..




## డిజిటల్‌గా బీఆర్ఎస్ సభ్యత్వం



- జిల్లాల వారీగా ఇంచార్జీల నియామకం
- బీఆర్ఎస్ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటి
- పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి

గజ్వెల్(జనంసాక్షి): బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్లు హరీశ్ రావు, సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడత పంపిణీ జూన్ 2 నుంచి..

- 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం
- స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని మిగతా 9లో..



## మోడీ పర్యటన తెలంగాణ బీజేపీ నేతల నారాజ్

ఓ ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి స్వయంగా విచ్చేసారు. దీంతో విపక్షాలు సహా సామాజిక వర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. 'పేద తెలంగాణ ప్రజలకు చేరువయ్యే ప్రభుత్వ ఆసుపత్రి పక్కనపెట్టి, కార్పొరేట్ వైద్యానికి ప్రధాని వేదికగా మారడం.. ఇది ప్రజ ల పట్ల చిన్నచూపు" అని విమర్శలు వెల్లువె త్తుతున్నాయి.

**తెలంగాణలో ఇమేజ్ సమస్య**

ఒకవైపు తెలంగాణలో ఈ వివాదాలు రగులుతుండగా, జాతీయ స్థాయిలో కూడా ప్రతిపక్ష కూటమికి కొత్త బలం చేకూరు తోంది. తమిళనాడు ఇండియా కూటమి జాబితాలో చేరడం బీజేపీకి దక్షిణాదిన మరింత సవాలు విసిరినట్లయ్యింది. అంతేకాదు, ఇటీవల జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో రాహుల్ గాంధీ ప్రధాన ఆకర్షణగా నిలవడం కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ పర్యటన మోడీకి రాజకీయంగా లాభం చేకూర్చిందా లేదా అన్న ప్రశ్నకు సమాధానం కాలమే చెప్పాలి. కానీ సొంత పార్టీలో అసంతృప్తి, ప్రజారోగ్య విస్మరణ ఆరోపణలు, మిత్రపక్ష పక్షపాతం ఈ మూడూ కలిసి బీజేపీకి తెలంగాణలో ఇమేజ్ సమస్య తలెత్తిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

## నిలువునా చీలిన రెండాకులు

అన్నాడీ ఎంకే చవిచూస్తోన్న ఓటములే ఈ మా ర్పునకు కారణమని షణ్ముగం వెల్లడిం చారు. "ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. డీఎంకేకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేను ఏర్పాటుచేశాం. 53 ఏళ్లుగా మా రాజకీయాలు ఆ దిశగానే కొనసాగాయి. కానీ డీఎంకే మద్దతుతో ఏఐఏడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన వచ్చింది. మెజార్టీ సభ్యులు దానిని తిరస్కరించారు. ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటే.. అన్నాడీఎంకే ఉనికే లేకుండాపోతుంది. ప్రస్తుతం మేం ఎలాంటి పొత్తులో లేము. ఇప్పుడు మా దృష్టి అంతా అన్నాడీఎంకేను పునరుద్ధరించి, బలోపేతం చేయడం పైనే ఉంది. చివరకు టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. ఆ పార్టీనే ఎన్నికల్లో విజయం సాధించింది" అని వెల్లడించారు. తమకు అన్నాడీఎంకేను ముక్కలు చేసే ఉద్దేశం లేదని షణ్ముగం చెప్పారు. "ఇది చీలిక కాదు. పార్టీని ముందుకు తీసుకెళ్లే విషయంలో జనరల్ సెక్రటరీ (ఎడప్పాడి పళనిసామి) తీసుకునే సరైన నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం" అని చెప్పారు. అలాగే భాజపాతో సంబంధాలు తెంచుకోవాలని తిరుగుబాటు గ్రూప్ ఆమోదించిన తీర్మానంలో ప్రస్తావించారు. శాసన సభాపతి పదవికి అధికార పార్టీ టీవీకే తరఫున జేసీడీ ప్రభాకర్ నామినేషన్ సమర్పించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన ఆ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన థౌజండ్ లైట్స్ ఎమ్మెల్యే. మిగతా పార్టీలకు మెజారిటీ లేకపోవడంతో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది.

అన్నాడీఎంకే రెబల్స్‌తో సీఎం విజయ్ భేటీ

తమిళనాడు శాసనసభలో సీఎం విజయ్ బలపరీక్షకు సిద్ధమవుతోన్న వేళ.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. ఇప్పటికే అన్నాడీఎంకే పార్టీలో చీలిక ఏర్పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి విజయ్ భేటీ కావడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్..తదితర మిత్రపక్షాల నేతలతో సమావేశమైన విజయ్.. అన్నాడీఎంకే సీనియర్ నేత సీవీ షణ్ముగం నివాసానికి వెళ్లారు. అక్కడ అన్నాడీఎంకే రెబల్స్ ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీలో బుధవారం బలపరీక్ష జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పార్టీ 47 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫలితాలు వెలువడిన తర్వాత ఈ పార్టీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తీరును సీనియర్ నేతలు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి, సి.విజయభాస్కర్ తదితరులు బహిరంగంగానే విమర్శించారు. ఈ క్రమంలోనే గత శనివారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతు తెలపటం, శాసనసభా కమిటీ నాయకత్వ బాధ్యతలపై వాడివేడి చర్చ జరిగింది. ఇందులో ఈపీఎస్ నిర్ణయాలతో విభేదించిన సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ నేపథ్యంలోనే పార్టీలో చీలిక ఏర్పడింది. తాము అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి విజయ్‌కు మద్దతిస్తామని షణ్ముగం నేతృత్వంలోని రెబల్ ఎమ్మెల్యేలు ఈ ఉదయం ప్రకటించారు. దీంతో షణ్ముగం వర్గం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను తాజాగా విజయ్ కలిశారు.

## తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం

చెన్నై(జనంసాక్షి):తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నిం టినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

తమిళనాట బ్యానర్లు ఫ్లెక్సీలు బ్యాన్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) శ్రేణులకు ఆ పార్టీ అధిష్టానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీని స్థాపించామని తెలిపిన టీవీకే, ప్రజలు ఇబ్బంది పడే పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఎన్. ఆనంద్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. నాయకుల పుట్టినరోజులు లేదా కుటుంబ వేడుకల సందర్భాల్లో వీధులు, బహిరంగ ప్రదేశాలు, జనసమూహం ఉన్న చోట లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని పార్టీ కార్యకర్తలను ఆదేశించింది. అంతేగాకుండా.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి వేడుకలు జరపకూడదని, ఒకవేళ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించినట్లు పార్టీ ప్రకటించింది. ప్రజలు మనపై ఎంతో నమ్మకం ఉంచారని, ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కార్యకర్తలకు సూచించింది.

## 'నీట్' రద్దు

కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తా మని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రం లోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండ టం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

**నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ కేసు నమోదు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సీబీఐ రంగంలోకి దిగింది. కేంద్ర విద్యాశాఖ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న జరిగిన పరీక్షలో అక్రమాలు జరిగినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే సీబీఐ అత్యంత చురుగ్గా స్పందించింది. నేరపూరిత కుట్ర, మోసం, ఇతర నేరాలకు సంబంధించి బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, ఈ కేసును దర్యాప్తు చేస్తున్న రాజస్థాన్ పోలీసుల (స్పెషల్‌ఆపరేషన్స్ గ్రూప్ -ఎస్‌ఓజీ) నుంచి సమాచారాన్ని సేకరించేందుకు త్వరలోనే ఓ బృందాన్ని అక్కడికి పంపనున్నారు. 2024లో నీట్ పేపర్ లీక్ కేసుల్ని సైతం సీబీఐ ఛేదించిన విషయం తెలిసిందే. మే 3న దేశ వ్యాప్తంగా 551 నగరాల్లో, ఇతర దేశాల్లోని 14 నగరాల్లో నీట్ యూజీ 2026 పరీక్ష జరగ్గా.. దాదాపు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.

**పేపర్ లీక్ కేసులో ఒకరి అరెస్టు**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో సంబంధం ఉన్న ఓ వ్యక్తిని మహారాష్ట్రలోని నాసిక్ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ పోలీసుల నుంచి ఈ ఉదయం వచ్చిన అభ్యర్థన మేరకు నాసిక్ క్రైం బ్రాంచ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ కిరణ్‌కుమార్ చౌహాన్ వెల్లడించారు. రాజస్థాన్ నుంచి పోలీసుల బృందం వచ్చి అతడిని తమ కస్టడీలోకి తీసుకుంటుందన్నారు.

**ఎవరో తప్పు చేస్తే.. మాకా శిక్ష?..**

**విద్యార్థుల ఆవేదన**

మరోవైపు, నీట్ పరీక్ష రద్దు కావడంపై విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "చాలా బాధగా ఉంది.. నేనేమీ తప్పు చేయలేదు. ఎవరో పేపర్ లీక్ చేస్తే... నేను శిక్ష అనుభవిస్తున్నాను. రెండేళ్లు కష్టపడి చదివి.. నా శ్రమను ధారపోశాను. అయినా మళ్లీ నేను ఈ పరీక్ష రాయాల్సి వస్తోంది" అని ఓ విద్యార్థిని వాపోయారు. 'ఇది చాలా బాధాకరం. ఏడాదంతా ఎంతో కష్టపడి చదివాం.. ఈ పరీక్ష వెనుక ఎన్నో నిద్రలేని రాత్రులు, కృషి దాగి ఉన్నాయి. కానీ, చివరకు ఇలాంటివి జరిగినప్పుడు ఆ బాధ ఎలా ఉంటుందో మాటల్లో చెప్పలేం" అని మరో విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేశారు.

13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.నైల్ పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి.

### లక్షలాది మంది విద్యార్థుల ఆశలపై నీళ్లు

స్పందించారు. దాదాపు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు పడిన కష్టం, వారి కలలు భాజపా సారథ్యంలోని అవినీతి వ్యవస్థ వల్ల ఛిన్నాభిన్నమయ్యాయన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "నీట్ పరీక్ష రద్దయింది. దేశ వ్యాప్తంగా 22లక్షల మందికి పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఛిన్నాభిన్న మయ్యాయి. కొందరు తండ్రులు రుణాలు తీసుకున్నారు. ఇంకొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం ఎన్నో రాత్రులు మేల్కొని ఉండి చదివా రు. ఇందుకు వారికి దక్కిన ప్రతిఫలం ఏంటంటే.. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి. ఇది కేవలం ఒక వైఫల్యం కాదు.. దేశ యువత భవిష్యత్తుపై జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్షల్లేకుండా తప్పించుకు తిరుగు తుండగా.. నిజాయతీపరులైన విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారు.ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోంది. ఒకరి తలరాతను వారి శ్రమతో కాకుండా.. డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక విద్యకు నిజమైన అర్థం ఏముంటుంది? ప్రధాని మోదీ చెబుతోన్న 'అమృత్ కాలం'.. దేశానికి విష యుగంగా మారింది" అని రాహుల్ గాంధీ ఆక్షేపించారు.

నీట్ వ్యవస్థే ఓ పెద్ద స్కామ్: స్టాలిన్

నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దు అంశంపై తమిళనాడు మాజీ సీఎం, డీఎంకే చీఫ్ స్టాలిన్ స్పందించారు. ఈ ఏడాది కూడా నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారన్నారు. నీట్ పరీక్ష ప్రక్రియలో ప్రతి దశలోనూ మోసాలు ఉన్నట్లు కనబడుతోందన్నారు. అసలు నీట్ వ్యవస్థే ఓ పెద్ద కుంభకోణం అని ఆరోపించారు. ఏటా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్ష విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోరు ఆధారంగానే ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని కోరారు. తమిళనాట కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం కూడా నీట్ పరీక్షకు వ్యతిరేకంగా తమ దృఢమైన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలన్నారు. ఈ పరీక్ష నుంచి మినహాయింపు కోరుతూ గతంలో తమ ప్రభుత్వం చేసిన న్యాయపరమైన ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లాలని విజయ్ సర్కారుకు సూచించారు.

నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్

దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

### విద్యార్థులకు శాపంగా ఎన్టీఏ వైఫల్యం: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): ప్రశ్నాపత్రం లీక్‌తో నీట్ పరీక్ష రద్దు కావడం కేంద్రానికి సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖఫీ) విమర్శించారు. ఎన్టీఏ వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందురోజే లీక్ అయ్యాయని.. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆక్షేపించారు. 2024లోనూ ప్రశ్నాపత్రం లీకైందన్నారు. ఎన్డీయే ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందన్నారు.

### ముళ్ల తీగలకు భయపడం..

**సరిహద్దుల్లో కంచెపై బంగ్లాదేశ్**

**ఢాకా(జనంసాక్షి):**

భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ పశ్చిమబెంగాల్‌లోని నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై తాజాగా బంగ్లాదేశ్ స్పందించింది. ముళ్ల తీగలకు ఢాకా భయపడదని ఆ దేశ విదేశాంగశాఖ సలహాదారు ఎం.హెచ్.కబీర్ వ్యాఖ్యానించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కబీర్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అవసరమైనప్పుడు భారత్‌తో చర్చలు జరుపుతామని వెల్లడించారు. బెంగాల్ లో కొత్త ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాలను తాము గమనిస్తున్నామన్నారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోవాలనుకోవడం లేదన్నారు. తమ సంబంధాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే ఉంటాయన్నారు. ప్రస్తుతం సవాళ్లు

### డిజిటల్‌గా బీఆర్ఎస్ సభ్యత్వం..

కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

### సింగిల్ స్క్రీన్లలో టికెట్ ధరలు పెంచబోం

**మీడియా సమావేశంలో తెలంగాణ ఎగ్జిబిటర్ల ప్రకటన**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. చిత్ర బృందాలు జీవో తెచ్చుకున్నా.. ఇకపై సింగిల్ స్క్రీన్లలో టికెట్ ధరలు పెంచబోమని స్పష్టం చేసింది. ఇది ప్రేక్షకులకు ఇస్తున్న భరోసా అని తెలిపింది. పర్సంటేజీ విధానంలో సినిమాలు ప్రదర్శిస్తేనే సింగిల్ స్క్రీన్లకు మనుగడ ఉంటుందని తెలంగాణ ఎగ్జిబిటర్లు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. 'అంతరించిపోతున్న సినిమా హాళ్లని కాపాడండి' అన్న నినాదంతో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. తాము నిర్మించిన చిత్రాలూ పర్సంటేజీ షేరింగ్ విధానంలో ప్రదర్శించేందుకు అంగీకరిస్తానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిరీష్."మేం పర్సంటేజీ విధానం గురించి మాట్లాడుతున్నామంతే. ఇది ఎగ్జిబిటర్ల బతుకు పోరాటం. ఏ సినిమానిగానీ ఏ నిర్మాతనుగానీ ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో ఇది చేయడం లేదు. థియేటర్లను రక్షించండి. మిగిలిన రాష్ట్రాల్లోని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానం అమలు చేసి తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఎందుకు రెంటల్ పద్ధతిలో సినిమాలు రిలీజ్ చేస్తున్నారో ప్రశ్నించుకోవాలి" అని శిరీష్ అన్నారు."నిర్మాత తండ్రి అయితే ఎగ్జిబిటర్ బిడ్డలాంటివాడు. అలా చూసినప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది. తండ్రి ఎంత కష్టపడినా అది బిడ్డల సుఖం కోసమే. గత 20 ఏళ్లుగా ఎగ్జిబిటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది గా పరిస్థితి మరింత దిగజారింది. సునీల్ నారంగ్, శిరీష్ తదితరులు కూడా థియేటర్ల అభివృద్ధి కోసం తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. నిర్మాతగా వారికి నా సపోర్ట్ ఉంటుంది. ప్రస్తుతం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల మధ్య సమన్వయం చాలా ముఖ్యం. సినిమా పరిశ్రమ మరింత అభివృద్ధి చెందేలా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగాలని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు.

**ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదు: సునీల్ నారంగ్**

"పర్సంటేజీ విధానం అమలు చేస్తామని చెబుతారుగానీ అమలు చేయరు. నిర్మాతలు కూడా నష్టాల్లోనే ఉన్నారు. మల్టీప్లెక్సుల్లో కొత్త టెక్నాలజీ, ఆధునిక సౌకర్యాలు తీసుకొస్తున్నారు. కానీ, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో అలాంటి సదుపాయాలు కల్పించలేకపోతున్నాం. డాల్బీ లాంటి ఆధునిక సౌకర్యాలు ఉంటే ప్రేక్షకులు తప్పకుండా సింగిల్ స్క్రీన్స్‌కి కూడా వస్తారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడితే నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకే నష్టం. మేం ఏ సినిమాను టార్గెట్ చేయడం లేదన్నారు

## మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

– కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు.ప్రతీ ఐకెపి సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

### బండి భగీరథ్‌కు పోక్సో కేసులో తాఖీదులు

డీసీపీ రితిరాజ్ సమక్షంలో మరోసారి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. అనంతరం పోక్సో సెక్షన్ 5 (1) రెడ్ విత్ 6ను అదనంగా జత చేశారు. తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని కోరుతూ బండి భగీరథ్ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 14న వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది.

హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

### నా కుమారుడిని నేరస్థుడిగా చూపేందుకు కుట్ర

కరీంనగర్(జనంసాక్షి): తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. "ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

### 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ నాయకులు స్పందించరేం?

హైదరాబాద్(జనంసాక్షి):

మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## 17 ఏళ్ల అమ్మాయిపై హనీట్రాప్ కేసు చట్టవిరుద్ధం


- కేసును నీరుగార్చడం కోసమే బండి భగీరథ్ అరెస్టులో అలసత్వం
- పలు మహిళా సంఘాల మండిపాటు



హైదరాబాద్ (జనంసాక్షి) : 17 ఏళ్ల అమ్మాయిపై హనీ ట్రాప్ కేసు పెట్టడం చట్టవిరుద్ధమని, బాధితురాలికి న్యాయం చేయకుండా ఫిర్యాదు చేయడానికొస్తే గంటల తరబడి స్టేషన్‌లో నిలబెడతారా అని పలు మహిళా సంఘాలు మండిపడ్డాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ నాలుగు నెలలుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు బాధితురాలు తెలియజేసిన వెంటనే పోక్సో కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పోలీసు అధికారులు రాజకీయ నాయకులకు గులాంగిరీ చేస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నారని, బాధితురాలిపైనే కేసులు పెట్టడం అందులో భాగమేనని పేర్కొన్నారు. బాధితురాలి తల్లి ప్రధాని మోడీ సభలో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తే తప్ప ఎఫ్ఐఆర్ బుక్ చేయలేదని, నిందితుడిని అరెస్టు చేయడంలో అలసత్వం కేసును నీరుగార్చడం కోసమేనని చెప్పారు. బెదిరింపులు, ప్రలోభాలకు గురిచేసి రాజకీయ పలుకుబడి ఉపయోగించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించి మహిళా రక్షణ, బేటీ బచావో వంటివి ఆచరణలో చూపించాలని మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా దోషులను శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం, అఖిల భారత మహిళా సమాఖ్య, ఆలిండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్, చైతన్య మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. నిందితులు రాజకీయ నాయకులైనప్పుడు బాధితురాలికి ఆమె కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, తక్షణమే వారికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు వి సంధ్య, జి ఝాన్సీ పాల్గొని మాట్లాడారు. పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు స్వరూప, అనసూయ, ఐద్వా నాయకులు మల్లు లక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కార్యదర్శి జ్యోతి, సీఎంఎస్ అధ్యక్షురాలు జ్యోతి తదితరులు మాట్లాడారు.

## మోడీ ఉపయోగించే విమానం అమ్మేయాలి

- అప్పుడే ఖర్చులు తగ్గించుకోవడం సాధ్యం
- స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన వ్యాఖ్యలు



లక్నో, మే12 (జనంసాక్షి) : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కొన్ని పొదుపు సూచనలు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పర్యటన సమయంలోఆయన బహిరంగ సభలో పాల్గొని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు ఆపాలన్నారు. డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడాలని సూచించారు. రాబోయే కరువు, దారిద్ర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ఆ సూచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రధాని పొదుపు సూచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దుబారా ఖర్చులు చేయవద్దు అంటే ముందుగా ప్రధాని వినియోగించే సుమారు 8 వేల కోట్ల ఖరీదైన ఎయిర్ ఇండియా వన్ విమానాన్ని అమ్మే యాలని స్వామి అవిముక్తే శ్వరా నంద అ న్నారు. ఆ విమానానికి బదు లుగా ఇంధనం తక్కువ ఖర్చు అయ్యే విమానాలను వాడాలని స్వామిజీ విమర్శించారు. ఖర్చులు తగ్గించు కోవాలని ప్రజలకు చెప్పడం కాదు, ముందుగా ఆ విమానాన్ని అమ్మేసేయాలని ఆయన అన్నారు. యూపీలోని సోన్‌భద్రతలో జరిగిన గోవిష్ట్ యాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పొదుపు అనేది అధికారంలో ఉన్న వ్యక్తుల నుంచే మొదలు కావాలని ఆయన అన్నారు. ధర్మం అనేది ఇంటి నుంచే మొదలు కావాలని అవిముక్తేశ్వరానంద అభిప్రాయపడ్డారు.

## వ్యక్తిగత హక్కులకు భంగం

- అనుమతి లేకుండా పేరు, ఫోటోల వాడకం
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నటుడు నాగార్జున

న్యూఢిల్లీ, మే12 (జనంసాక్షి) : తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టును సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాడుకుంటున్నారని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని కోర్టు దృష్టికి నాగార్జున తీసుకెళ్లారు. ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున టీ షర్టులు మీరెలా అమ్ముతారంటూ వ్యాపారిని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది. తొలుత వ్యాపారి తరపు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా ప్రొడక్షన్ హౌస్‌తో తమకు ఒప్పందం ఉందని.. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని స్పష్టం చేశారు. దీనిపై నాగార్జున తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలు అడిగినప్పటికీ సమర్పించ లేదని, కోర్టుకు ఇచ్చిన ఈ-మెయిల్ కాపీలు సైతం అసంపూర్ణంగా ఉన్నాయని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరికి, ఈ వ్యవహారంలో తమకు నాగార్జునతో కానీ, సంబంధిత నిర్మాణ సంస్థతో కానీ ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని న్యాయస్థానం ముందు వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నాగార్జున, ప్రొడక్షన్ హౌస్‌తో ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే అంగీకరిస్తున్నప్పుడు.. టీ షర్టులను విక్రయించే చట్టబద్ధత ఎక్కడి నుంచి వచ్చిందని సీరియస్ అయ్యింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

## భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

- బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా
- మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం



హైదరాబాద్, మే12 (జనంసాక్షి) : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

## వారి సేవలు చిరస్మరణీయం

- వారిది ఉదయోగం కాదు...నిరంతర సేవ
- 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందచేత
- వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర



హైదరాబాద్, మే12 (జనంసాక్షి) : ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మిర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తిండిపోతుంది. నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె. మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.

## బండి కుమారుడిని తప్పించే యత్నం

- సిట్ విచారణ పేరుతో కాలయాపన
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు



నిజామాబాద్, మే12 (జనంసాక్షి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు. సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజయ్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

## నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

- పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు

హైదరాబాద్, మే12 (జనంసాక్షి) : నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔఆఈః అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

- కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్, మే 12 (జనంసాక్షి) : ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.

## అన్నాడీఎంకేలో లుకలుకలు

- పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు
- టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం



చెన్నై, మే12 (జనంసాక్షి) : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారధ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవుతుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం' అని షణ్ముగం తెలిపారు. సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొన్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా తామంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

## రైల్ రోకో కేసులో కల్వకుంట్ల కవితకు సమన్లు

- నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన కల్వకుంట్ల కవిత
- కవితతో పాటు మరో 12 మంది టీఆర్ఎస్ నాయకులపైనా కేసులు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు. రైల్ రోకో కేసులో కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు. 2025 నవంబర్ 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు.. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించి పంపిన బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలుపాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు.. కల్వకుంట్ల కవితతో పాటు రైల్ రోకో చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. కల్వకుంట్ల కవితతో పాటు టీఆర్ఎస్ నాయకులు చేపట్టిన రైల్ రోకో కారణంగా సిర్నపల్లి - ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న దేవగిరి ఎక్స్ ప్రెస్ ను నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూట్ లో ప్రయాణిస్తున్న మరో గూడ్స్ రైలును నిలిపివేశారు. రైల్ రోకో చేపట్టిన కల్వకుంట్ల కవితతో పాటు మరో 12 మంది నాయకులపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కవితతో పాటు 12 మంది టీఆర్ఎస్ నాయకులపై యూ/సెక్షన్ 147అండ్74(ఏ) రైల్వే యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సికింద్రాబాద్ రైల్వేస్ సెకండ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసెస్ కోర్టు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
13 మే 2026

# అధికారపు మదానికి 'న్యాయం' తలొగ్గొద్దు!

**రాజ్యాంగం కల్పించిన అత్యున్నత హక్కులలో 'చట్టం ముందు అందరూ సమానులే' అనేది ప్రాథమిక సూత్రం. అయితే, ఈ సూత్రం కాగితాలకే పరిమితమా లేక ఆచరణలోనూ ఉందా అనే పరీక్ష ఎదురైనప్పుడు వ్యవస్థలు తడబడటం ప్రజాస్వామ్యానికి చేటు. ముఖ్యంగా పోక్సో (లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం) వంటి కఠినమైన చట్టాలు అమలులో ఉన్నప్పుడు, నిందితుల సామాజిక హోదా లేదా రాజకీయ నేపథ్యం దర్యాప్తుపై ప్రభావం చూపడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం.**

సంపాదకీయం

పోక్సో చట్టం ప్రకారం బాధితురాలు మైనర్ అయినప్పుడు, 'అంగీకారం' అనే పదానికి తావే లేదు. ఇది ఒక చట్టపరమైన రక్షణ కవచం. కానీ, సోషల్ మీడియా వేదికగా నిందితులకు వంత పాడుతూ, బాధితురాలి వ్యక్తిత్వాన్ని హననం చేయడం లేదా అది పరస్పర అంగీకారంతో జరిగిందని ప్రచారం చేయడం చట్టాన్ని అపహాస్యం చేయడమే. అధికారం ఉన్నవారు తమ ప్రభావంతో కేసు దిశను మార్చాలని చూడటం బాధితురాలిని రెండోసారి హింసించడమే అవుతుంది. బాధితులపైనే తిరుగు కేసులు పెట్టడం, వారిని మానసికంగా కృంగదీయడం ఇప్పుడు ఒక ఫ్యాషన్‌గా మారింది. నిందితులపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాల్సింది పోయి, బాధితుడిని లేదా ఫిర్యాదుదారుడిని నిందితుడిగా చిత్రీకరించే 'రాజకీయ వ్యూహాలు' ప్రమాదకరం. పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, ఒక వర్గానికి రక్షణ కవచంగా మారితే, సామాన్యుడు న్యాయం కోసం ఏ తలుపు తట్టాలి? "బేటీ బచావో, బేటీ పఢావో" వంటి నినాదాలు సభలకే పరిమితం కాకూడదు. అధికార పీఠాల్లో ఉన్న నాయకుల కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు, మరింత పారదర్శకంగా దర్యాప్తు జరగాలి. అప్పుడే ఆ నినాదాలకు అర్థం ఉంటుంది. బండి సంజయ్ వంటి కీలక నేతల కుటుంబ సభ్యుల పేర్లు వివాదాల్లోకి వచ్చినప్పుడు, నిష్పక్షపాత విచారణ ద్వారా నిజానిజాలు తేలాలి. అది జరగనప్పుడు ప్రజల్లో వ్యవస్థల పట్ల నమ్మకం సన్నగిల్లుతుంది.

దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు రాజకీయ రంగుకు అతీతంగా పనిచేయాలి. చట్టం ముందు మంత్రి కుమారుడైనా, సామాన్యుడైనా ఒక్కటే అనే స్పష్టమైన సందేశాన్ని సమాజానికి ఇవ్వాల్సిన బాధ్యత పోలీసుల మీద ఉంది. న్యాయం ఆలస్యం కావడం అంటే, అన్యాయం చేస్తున్న వారికి సహకరించడమే. అధికారం అంటే బాధ్యత, అహంకారం కాదు. అధికారపు అడ్డంకులు లేకుండా చట్టం తన పని తాను చేసుకుపోవాలి. బాధితురాలు భయం లేకుండా నిజం చెప్పగలిగే వాతావరణం ఉన్నప్పుడే మనం నాగరిక సమాజంలో ఉన్నామని చెప్పుకోగలం. ఏ రాజకీయ వారసత్వమూ చట్టం కంటే పెద్దది కాదు. న్యాయం గెలవాలి, అది అందరికీ సమానంగా అందాలి. అత్యున్నత స్థానంలో ఉన్నవాడు చట్టానికి లోబడి ఉండాలి. అప్పుడే నిమ్న స్థాయిలో ఉన్నవాడు సురక్షితంగా ఉంటాడు.

## ఎఐఎంఐఎం, బీజేపీ అప్రకటిత అనుబంధం

# ఓట్ల చీలిక రాజకీయాలు




భారత ఎన్నికల రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా ఒక ముఖ్యమైన వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రత్యక్షంగా గెలవలేని ప్రాంతాల్లో ప్రతిపక్ష ఓట్లను చీల్చడం, మైనారిటీ వర్గాల రాజకీయ ఐక్యతను బలహీనపరచడం, ప్రాంతీయ పార్టీల సామాజిక ఆధారాలను దెబ్బతీయడం ద్వారా అధికారాన్ని సాధించే రాజకీయ పద్ధతి బలపడింది. ఈ చర్చలో ఎక్కువగా ప్రస్తావనకు వస్తున్న పార్టీ అల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్, అంటే ఎఐఎంఐఎం. అధికారికంగా ఈ పార్టీ భారతీయ జనతా పార్టీకి తీవ్ర వ్యతిరేకి అని ప్రకటించుకున్నా, ఎన్నికల ఫలితాల విశ్లేషణ చూస్తే అనేక రాష్ట్రాల్లో ఎఐఎంఐఎం పోటీ వల్ల బీజేపీకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లాభం జరిగిన ఉదాహరణలు అనేకం పెరుగుతున్నాయి.

ఎఐఎంఐఎం 2014కు ముందు ప్రధానంగా హైదరాబాద్ పాతనగరానికి మాత్రమే పరిమితమైన ప్రాంతీయ పార్టీ. అసదుద్దీన్ ఒవైసీ కుటుంబ ఆధిపత్యంలో నడిచే ఈ పార్టీ తెలంగాణ బయట పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ 2014 తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారింది. మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పార్టీ వేగంగా అభ్యర్థులను నిలబెట్టడం ప్రారంభించింది. ఈ విస్తరణను పార్టీ "జాతీయ రాజకీయ విస్తరణ"గా ప్రచారం చేసినా, ప్రతిపక్షాలు మాత్రం దీన్ని "ఓట్ల చీలిక వ్యూహం"గా విమర్శించాయి.

2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఈ చర్చను మరింత వేడెక్కించాయి. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర్ దినాజ్‌పూర్ వంటి ముస్లిం జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో ఎఐఎంఐఎం అభ్యర్థులు గెలవకపోయినా వేల సంఖ్యలో ఓట్లు సాధించారు. అనేక నియోజకవర్గాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమి మార్జిన్ కంటే ఎఐఎంఐఎం సాధించిన ఓట్లు ఎక్కువగా ఉండటం రాజకీయ విశ్లేషణలకు దారి తీసింది. కాండి వంటి నియోజకవర్గాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఈ పరిస్థితిని ఉపయోగించుకుని బీజేపీ తక్కువ ఓట్ల తేడాతో సీట్లు దక్కించుకుంది.

ఇది బెంగాల్‌కే పరిమితం కాదు. 2022 ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కూడా ఇదే వాదన బలంగా వినిపించింది. బిజ్నోర్, నకూర్, కుర్సీ, సుల్తాన్‌పూర్ వంటి నియోజకవర్గాల్లో ఎఐఎంఐఎం సాధించిన ఓట్లు సమాజ్‌వాదీ పార్టీ-రాష్ట్రీయ లోక్ దళ్ కూటమి ఓటమి మార్జిన్ కంటే ఎక్కువగా ఉండటాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తించారు.

అనేక సీట్లలో బీజేపీ విజయం చాలా తక్కువ తేడాతో వచ్చిన నేపథ్యంలో, ముస్లిం ఓట్ల విభజన అధికార పార్టీకి లాభించిందనే విమర్శలు కూడా వచ్చాయి. 2020 బీహార్ ఎన్నికల్లో సీమాంచల్ ప్రాంతంలో ఎఐఎంఐఎం ఐదు సీట్లు గెలిచింది. ఇది పార్టీకి ఒక రాజకీయ విజయంలా కనిపించి నా, విస్తృత రాజకీయ సమీకరణంలో మాత్రం మహాగఠ్‌బంధన్‌కు నష్టం జరిగిందని విశ్లేషణలు వెలువడ్డాయి. కిషన్‌గంజ్, అరరియా, పూర్నియా ప్రాంతాల్లో ముస్లిం-దళిత-పేద వర్గాల ఓట్లు విడిపోవడం వల్ల ఎన్‌డిఏ కూటమి పరోక్ష లాభం పొందిందని అప్పట్లో జనతాదళ్ యునైటెడ్, రాష్ట్రీయ జనతాదళ్ నాయకులే విమర్శించారు.

ఢిల్లీ ఎన్నికల్లో కూడా ముస్తఫాబాద్ వంటి నియోజకవర్గాల్లో ఇదే ఆరోపణలు వినిపించాయి. ఎఐఎంఐఎం సాధించిన ఓట్లు ప్రత్యక్షంగా ఆమ్ ఆద్మీ పార్టీ లేదా కాంగ్రెస్‌కు తగ్గి, బీజేపీకి ప్రయో జనం చేకూర్చాయనే చర్చ జరిగింది. గుజరాత్ ఎన్నికల్లో కూడా కొన్ని పట్టణ ముస్లిం ప్రాంతాల్లో ఎఐఎంఐఎం పోటీ ప్రతిపక్ష ఓట్ల విభజనకు దోహదపడిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్న ఏమిటంటే - కేంద్ర దర్యాప్తు సంస్థల వ్యవహారం. దేశంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ద్రవిడ మున్నేట్ర కళగం, శివసేన, సమాజ్‌వాదీ పార్టీ వంటి దాదాపు అన్ని ప్రతిపక్షాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఇన్కమ్ టాక్స్ దాడులు జరిగాయి. కానీ ఎఐఎంఐఎంపై అలాంటి ఒత్తిడి తక్కువగా కనిపించిందనే విమర్శలు ఉన్నాయి. దీనిని ప్రతిపక్షాలు "రాజకీయ ఎంపిక "గా ప్రతిపక్షాలు, రాజకీయ విశ్లేషకులు, సాధారణ ప్రజలు అభివర్ణిస్తున్నారు. అయితే దీనికి ప్రత్యక్ష ఆధారాలు మాత్రం ఇప్పటివరకు బహిర్గతం కాలేదు. అయినప్పటికీ రాజకీయాల్లో "ఎవరిపై దాడి జరుగుతుంది, ఎవరిని వదిలేస్తారు" అనే అంశం కూడా ప్రజల్లో అనుమానాలకు కారణమవుతోంది.

బీజేపీ రాజకీయ వ్యూహంలో మరో ముఖ్యమైన అంశం ధ్రువీకరణ రాజకీయాలు. ఒకవైపు హిందుత్వ భావజాలాన్ని బలపరుస్తూ మెజారిటీ ఓటర్లను ఏకం చేయడం, మరోవైపు ముస్లిం రాజకీయ ప్రతినిధిత్వాన్ని ప్రత్యేక గుర్తింపుతో విభజించడం అనే ద్వంద్వ వ్యూహం అనేక ఎన్నికల్లో కనిపించింది. ఈ పరిస్థితిలో ఎఐఎంఐఎం వంటి పార్టీలు బీజేపీకి రాజకీయంగా "సౌకర్యవంతమైన ప్రత్యర్థులు"గా మారుతున్నాయనే అభిప్రాయం కొందరిలో బలపడింది. ఎందుకంటే ముస్లిం గుర్తింపు ఆధారిత రాజకీయాలు పెరిగిన కొద్దీ హిందూ ఓట్ల ధ్రువీకరణ కూడా బలపడే అవకాశం ఉంటుంది.

అయితే మరోవైపు ఎఐఎంఐఎం వాదన కూడా పూర్తిగా విస్మరించలేం. తమకు స్వతంత్ర రాజకీయ హక్కు ఉందని, ముస్లింలు కేవలం "వోటు బ్యాంక్" కాదని, తమ స్వరాన్ని తామే వినిపించుకోవాలని పార్టీ చెబుతోంది. కాంగ్రెస్, తృణమూల్, సమాజ్‌వాదీ పార్టీలు ముస్లింల ఓట్లు తీసుకున్నా సరైన రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వలేదని ఎఐఎంఐఎం ఆరోపిస్తుంది. ఈ వాదనలో కూడా కొంత వాస్తవం ఉంది. ఎందుకంటే అనేక లౌకిక పార్టీలు ముస్లింలను కేవలం ఎన్నికల సమయంలోనే గుర్తు చేసుకుంటున్నా యనే విమర్శ కూడా చాలా కాలంగా వినపడుతుంది.

కానీ, భారత రాజకీయ వాస్తవికతలో ఫలితాలే ముఖ్యం. ఒక పార్టీ ఉద్దేశం ఏదైనా కావచ్చు, కానీ దాని రాజకీయ చర్యల వల్ల ఎవరికి లాభం జరుగుతోంది అన్నదే చివరికి కీలకం అవుతుంది. గత దశాబ్దం ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే, ఎఐఎంఐఎం పోటీ చేసిన అనేక ప్రాంతాల్లో బీజేపీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లాభపడిందనే అభిప్రాయానికి బలం లభిస్తోంది. ఇదే కారణంగా "రహస్య మిత్రత్వం" ఆరోపణలు తరచుగా వెలువడుతున్నాయి.

భారత ప్రజాస్వామ్యంలో గుర్తింపు రాజకీయాలు, మత ధ్రువీకరణ, ఓట్ల చీలిక వ్యూహాలు పెరిగే కొద్దీ అసలు ప్రజా సమస్యలు వెనుకబడుతున్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, ఆరోగ్యం, రైతు సంక్షోభం వంటి అంశాలపై ఎన్నికలు జరగాల్సిన చోట ఇప్పుడు మత సమీకరణాలే ప్రధాన రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయి. ఇదే ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

**నగరం చిత్తడి.**
నాలాలు డీల
వీధుల్లో ముర్కిగోల
మానవ లీల
వర్షపు వేళ
కంకరు తేలిన
బాటలు
నోళ్ళు తెరచిన
మ్యాన్హోల్సు
అలకరణ కోల్పోయిన
సినినటిలా నగరం
వర్షపువేళ
అస్తవ్యస్తమైన
జీవన వ్యవస్త
లీకేజులు
కూలిన
పాతభవంతులు
ఎగిరి పోన గుడిసె
కప్పులు
నిద్రపట్టని రాత్రి
ఎటుపాలుపోక
ఉదయం గదుల్లో
బందీ వర్షపు వేళ
ఎండకు
వానకు
చలికి
భయమెందుకు
వాటితోనే
మనజీవన ప్రయాణం
వర్షపు వేళైన...

**రేడియమ్**
**9291527757**




# మోడీ చేతిలో కొలీజియం!




'ప్రభుత్వంలో ఉన్న వాళ్లకి నచ్చని తీర్పు లిస్తే బదిలీ చేస్తారా?' అంటూ సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఇటీవల విమర్శించారు.

పూణేలోని ఐ.ఎల్.ఎస్. లా కాలేజీలో 'జి.వి. పండిట్ మెమోరియల్ లెక్చర్' పేరుతో నిర్వహించిన ఒక కార్యక్రమంలో వాడిన మాటలు ఇవి. ఇప్పటి అలహాబాద్ హై- కోర్ట్ జడ్జి అతుల్ శ్రీధరన్ గారి 'ఒక నాటి బదిలీ'ని ఉద్దేశించి అన్న మాటలు ఇవి. జస్టిస్ భూయానే కాకుండా జ్యుడీషియరీ కి చెందిన ఇంకొందరు కూడా మాట్లాడారు. వాళ్ళల్లో నేషనల్ జుడిషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్, 'ప్రొఫెసర్ జి. మోహన్ గోపాల్' కూడా ఉన్నారు.

"అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఉండే న్యాయమూర్తులతో హైకోర్టులను నింపే ప్రయత్నం జరుగుతోంది. న్యాయవ్యవస్థను ఒక థియోక్రటిక్ సంస్థగా మార్చి, హిందూ రాష్ట్రానికి కీలక స్థంభంగా వేద ఆజ్ఞలను అమలు చేసే దిశగా నడిపించాలనే యత్నం కనిపిస్తోంది' అని ఆయన అన్నారు.

ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశిస్తూ 'ఆమె ఉగ్రవాదుల సోదరి, అలాగే వారి సముదాయానికి చెందిన ఒక మహిళ' అంటూ 2025 మే 12న, మధ్యప్రదేశ్ మంత్రి 'కున్వర్ విజయ్ షా' అభ్యంతరకరంగా మాట్లాడాడు. దానిని మధ్య ప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు జడ్జి శ్రీధరన్ గారు ఆ మాటల్ని సుమోటోగా స్వీకరించి, కేసును నమోదు చేయించారు. దానికి ప్రతీకారంగానే ' మోడీ ప్రభుత్వం' ఆయన్ని బదిలీ చేయించింది. ఆ బదిలీ అన్యాయంగా అనిపించిన వీరంతా ఆ చర్యను ఇప్పుడు ఖండిస్తున్నారే గానీ, అప్పుడు మౌనంగానే ఆమోదించారు.

అంతే కాదు; 'ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, మార్చుకున్నట్లు' సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగంగానే అంగీకరించింది. పైగా ఈ బదిలీ ని సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని 'సుప్రీంకోర్టు కొలీజియం' చేసింది. ఇదే కొలీజియం జస్టిస్ అతుల్ శ్రీధర్ ని మొదటగా ఛత్తీస్ ఘడ్ కి బదిలీ చేసింది.

ఆ తరువాత మోడీ ప్రభుత్వం ఆదేశం మేరకు అలహాబాద్ కి బదిలీ చేసింది.'ప్రభుత్వం కోరిన పునఃపరిశీలన అనంతరం న్యాయమూర్తి అతుల్ శ్రీధరన్‌ను మొదట ప్రతిపాదించిన ఛత్తీస్‌గఢ్‌కు కాకుండా మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు' తానే ప్రకటించుకుంది.

ప్రభుత్వం చేసిన అభ్యర్థనను ఈ విధంగా బహిరంగంగా నమోదు చేయడం కొలీజియం చరిత్రలో ఇదే మొదటిసారి కావొచ్చు.

అయితే, ' సెకండ్ జడ్జెస్ కేసు (1993), మరియు 'థర్డ్ జడ్జెస్ కేసు (1998) లలో రూపొందించిన విధానం ప్రకారం, ప్రభుత్వం కోరితే కొలీజియం తన సిఫారసును తిరిగి పరిశీలించాల్సి ఉంటుంది.' అంటూ తనని తను సమర్థించుకుంది.

2023లో, 'తన కుమార్తె ఇండోర్‌లో న్యాయవాద వృత్తి లో వుంది కాబట్టి, దానిని కొనసాగించేందుకు వీలుగా జమ్మూ-కాశ్మీర్ ఒ లద్దాఖ్ హైకోర్టుకు బదిలీ కావాల'ని శ్రీధర్ కోరారు. అ కోరిక మేరకు ఆయన్ని అక్కడ కు పంపారు. అయితే అక్కడ 'పబ్లిక్ సేఫ్టీ యాక్ట్' కింద జారీ చేసిన పలు 'నిర్బంధ ఉత్తర్వుల'ను ఆయన ధర్మాసనం కొట్టివేసింది. ఆ విధంగా ఆయన అక్కడ కొంత మంచి పేరును కూడా సంపాదించుకున్నారు. ఏమి జరిగిందో తెలియదు గానీ ఆయన్ని మార్చి 2025లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు మళ్లీ బదిలీ చేశారు. మధ్య ప్రదేశ్‌లో ఖురేషి మీద సొల్లు కూతలు కూసినందుకు గాను మంత్రి 'కున్వర్ విజయ్ షా' మీద జస్టిస్ శ్రీధరన్ గారి ఆదేశాల మేరకు మే 14 కేసు బుక్ అయ్యింది. అది ప్రభుత్వానికి నచ్చలేదు. ఆ సందర్భంగా మోడీ ప్రభుత్వ వొత్తిడి మేరకు అక్కడ నించి ఆయన్ని మళ్లీ ఆగస్టు 25 న, మధ్య ప్రదేశ్ హైకోర్ట్ నుండి చత్తీస్‌ఘడ్ హైకోర్ట్ కు బదిలీ చేయాలని 'సుప్రీం కోర్టు కొలీజియం' నిర్ణయించింది.

అయితే గుడ్డిలో మెల్లగా 2028 మే నెలలో రిటైర్ అయ్యే ఆయనకు మంచి జరగాలనే ఉద్దేశ్యం తో కొలీజియం ఆయన్ని చత్తీస్ ఘడ్ కి పంపే ప్రయత్నం చేసింది. ఎందుకంటే సీనియారిటీ ప్రకారం అక్కడ ఆయన నాల్గవ స్థానంలో ఉంటారు.

అంతే కాకుండా, ఛత్తీస్ ఘడ్ చీఫ్ జస్టిస్ 'సురేష్ కుమార్ కైట్' పదవీ విరమణ, అలాగే జస్టిస్ 'అలోక్ అరాధే' పదోన్నతి కారణంగా, శ్రీధరన్ కి 'హైకోర్టు కొలీజియం' లో భాగమయ్యే అవకాశం ఒకటి వొచ్చింది. వాటిని దృష్టిలో పెట్టుకుని, సుప్రీంకోర్టు కొలీజియం ఆయనను ఆగస్టులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది. కానీ, అలా చేసిన రెండు నెలలలోపే ఆ నిర్ణయం కూడా మారిపోయింది. 'సుప్రీం కొలీజియం' ప్రభుత్వానికి లొంగిపోయింది. చత్తీస్ ఘడ్ కి పంపించాల్సిన ఆ వ్యక్తిని అలహాబాద్‌కు బదిలీ చేయాలని నిర్ణయించారు. ఛత్తీస్ఘడ్ లో వుంటే సీనియారిటీలో 'నాల్గవ స్థానం' లో వుండే ఆయన్ని సీనియారిటీప్రకారం 'ఏడవ స్థానం' లో వుండే అలహాబాద్ కి పంపి, ఆయన భవిష్యత్తును దెబ్బ కొట్టారు.

ఇదంతా మధ్య ప్రదేశ్ మంత్రి అజయ్ షా మీద FIR నమోదు చేయించినందుకు ప్రతీకారంగానే మోడీ ప్రభుత్వం ఇలా చేసింది.

ఇదొక్కటే అని కాదు; జస్టిస్ శ్రీధరన్ మీద ప్రభుత్వానికి ఇంకొక 'పాత పగ' కూడా వుండింది. 2020 ఢిల్లీ లో జరిగిన అల్లర్ల సమయంలో, ముగ్గురు బీజేపీ నాయకులపైన ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసి వుండగా, పోలీసులు చేయలేదు. 'ఎందుకు చేయలేదు?' అంటూ ఢిల్లీ పోలీసులను ఆయన తీవ్రంగా ప్రశ్నించారు.

అలా ప్రశ్నించిన అ రోజే ఆయన్ని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. కానీ, వాటిని అమలు చేయకుండా అలా వుంచారు. 'ధైర్యమైన నిర్ణయాలు తీసుకొంటున్న న్యాయమూర్తుల్లో కొందరికి ఇలాంటి పరిణామాలు ఎదుర్కోక తప్పదు' అని రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అభయ్ ఎస్. ఓకా కూడా అ ఘటన నుద్దేశించి అప్పుడే ఒక కామెంటుని కూడా చేశారు.

జడ్జిల నియామకాల, బదిలీల నిర్వహణను 'ఎగ్జిక్యూటివ్' చేతిలో పెడితే, అది అధికార దుర్వినియోగానికి దారితీస్తుందనే అనుమానంతో, దాన్ని 'జ్యుడీషియరీ' చేతిలో పెడితే, అది కూడా పరాధీన స్థితిలోకి (పోనీ నిస్సహాయ స్థితిలోకి) వెళ్లి పోయింది. అలా వెళ్లిపోవడం అనేది అత్యంత విచారకరం!

'సుప్రీం కోర్టు న్యాయమూర్తులను ఎవరు నియమించాలి?"

"హైకోర్టు న్యాయమూర్తులను ఎవరు నియమించాలి?"

అనే చర్చ ఈనాటిది కాదు. అలాగే మన దేశానికే పరిమితమైనది కూడా కాదు. చాలా దేశాల్లో ఈ చర్చ జరిగింది. కొన్ని దేశాలు తమ సంప్రదాయాలను రాసిపెట్టుకుని, వాటిని కొద్దిగా అటు ఇటుగా అమలు చేస్తూ వస్తున్నాయి.

బ్రిటన్‌లో ఈ పని 'లార్డ్ ఛాన్సలర్' చేస్తాడు. అమెరికాలో 'సెనెట్' ఈ వ్యవహారంలో కీలక పాత్ర వహిస్తుంది.

'అమెరికాలో అంతా ఇదే సంప్రదాయమా?" అంటే-కొన్ని రాష్ట్రాలు దీనికి మినహాయింపులు. ఆ రాష్ట్రాల్లో 'జడ్జీల నియామకాల పని'ని స్వతంత్ర కమిషన్ చేస్తుంది. ఆ కమిషన్‌లో సీనియర్ జడ్జీలు, సీనియర్ లాయర్లు, కమ్యూనిటీ ప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు కూడా ఉంటారు. ఈ "ఇండిపెండెంట్ కమిషన్" విధానం కెనడా, జపాన్, ఐర్లాండ్, న్యూజిలాండ్, నెదర్లాండ్స్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో కూడా ఉంది. దక్షిణాఫ్రికాలో అయితే ఇది ఇంకా విస్తృతంగా ఉంటుంది-ఆ దేశానికి చెందిన 11 విభాగాల ప్రతినిధులు ఇందులో భాగమవుతారు.

"ప్రపంచ దేశాల్లో జడ్జీల నియామకాలు ఎలా జరుగుతున్నాయి?" అనే అంశంపై కొంత పరిశోధన చేసి 'Appointments of Judges: An Issue of Judicial Independence" అనే పుస్తకాన్ని రాసిన సర్కార్ అలీ అబ్బాస్ అనే వ్యక్తి, "ఈ విషయంలో దక్షిణాఫ్రికా మోడల్ మిగతా దేశాలకు ఆదర్శంగా ఉండవచ్చు" అని అన్నారు.

ఇలాంటి చర్చ మన దగ్గర కూడా జరిగింది. 'రాజ్యాంగ విధాన నిర్ణయ సభ' లో ఈ అంశంపైన లోతుగానే చర్చ జరిగింది.

"న్యాయస్థానాలను ప్రభుత్వం లోపల నుంచి కూడా కాదు, వెలుపల నుంచి కూడా కాదు-ఏ ఒత్తిడికీ లోబడకుండా ఉంచాలి" అని కొందరు అభిప్రాయపడ్డారు.

"కోర్టుల పరిధికి కూడా కొంత పరిమితి విధించాలి" అని మరికొందరు వాదించారు. 'న్యాయవ్యవస్థ స్వచ్ఛంగా, స్వతంత్రంగా' ఉండే విషయంపైన అడ్వకేట్ కమిటీ సభ్యులకు, రాజ్యాంగ విధాన నిర్ణయ సభ సభ్యులకు మధ్య కొంత సంవాదం జరిగింది. ఆ వాదోపవాదాల్లో ఏ వాదం గెలుస్తుందో తెలియని సమయంలో, 1947 డిసెంబర్ చివర్లో-'స్థానిక రాజకీయాలు జడ్జీల ఎంపిక విషయంలో ప్రభావం చూపకుండా చూడండి"

అంటూ ఫెడరల్ కోర్టు చీఫ్ జస్టిస్ హెచ్.జె. కానియా, నెహ్రూకు ఒక లేఖ కూడా రాశారు.

1948 మార్చి 26, 27 తేదీల్లో న్యూఢిల్లీలో- ఫెడరల్ కోర్టు జడ్జీలు, హైకోర్టు జడ్జీలు అత్యవసరంగా సమావేశమై, ' హైకోర్టు జడ్జీలు నిర్భయంగా పని చేస్తూ, స్వతంత్రంగా, అవినీతికి అతీతంగా, సమర్థంగా ఉండే న్యాయవ్యవస్థను భారతదేశం కాపాడుకోవాలి" అంటూ రాజ్యాంగ పెద్దలకు ఒక స్పష్టమైన సూచన ఇచ్చారు.

ఇదంతా జరుగుతున్న సమయంలోనే- "రాష్ట్రపతి నిర్ణయాన్ని బట్టి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు రాష్ట్ర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను, రాష్ట్రాల గవర్నర్లను సంప్రదించి ఇతర న్యాయమూర్తులను నియమించాలి"

అంటూ 'డ్రాఫ్ట్ కమిటీ' అప్పటికే చెప్పిన మాటలను అమలు పరచాలని రాజ్యాంగ సభ తేల్చి చెప్పింది.

('తేజ్ బహదూర్ సప్రూ' అనే ప్రముఖ న్యాయవాది ఈ డ్రాఫ్ట్ రిపోర్టును రూపొందించారు. ఆయన అలహాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1934లో రూపొందించిన ఈ నివేదికను "సప్రూ రిపోర్ట్" అని పిలుస్తారు.)

ఇటు బ్రిటన్‌లోని లార్డ్ ఛాన్సలర్ నియామక విధానానికీ అటు అమెరికాలో సెనెట్ ద్వారా జరిగే న్యాయమూర్తుల నియామకాల విధానానికీ మధ్యన ఒక సమతుల్యతగా-"సప్రూ పద్ధతి"నే సరైనదిగా అంబేద్కర్ కూడా సభలో సూచించారు.

"భారతదేశంలో బ్రిటన్ పద్ధతిని అనుసరిస్తే, పూర్తిస్థాయి పారదర్శకత లేకుండా పోతుంది.

అలాగే అమెరికా పద్ధతిని అనుసరిస్తే, బహిరంగ రాజకీయాలకు న్యాయస్థానాల తలుపులు పూర్తిగా తెరుచుకున్నట్లవుతుంది"

అని అంబేద్కర్ హెచ్చరించారు.

అందుకే రాజ్యాంగ సభలో జడ్జీల నియామకాల విషయంలో "సప్రూ పద్ధతి"నే మెజారిటీ సభ్యులు ఆమోదించారు. అదే క్రమంలోనే మనం ఇప్పుడు "కొలీజియం వ్యవస్థ" అని పిలుస్తున్న పద్ధతి రూపుదిద్దుకుంది. అన్ని వ్యవస్థలూ తన చెప్పు చేతల్లో ఉండాలని కోరుకునే మోడీ దీన్ని పూర్తిగా తన చేతుల్లో ఉంచుకోడానికి జుడిషియల్ నియామకాల జాతీయ కమిషన్ (NJAC) బిల్లును 2014లో ప్రవేశపెట్టారు. రాజ్యసభ ఆమోదించింది. దానికి అను బంధంగా వచ్చిన 121వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో 180 ఓట్లు పడగా, 179 ఓట్లు అనుకూలంగా వచ్చాయి.

కానీ ఆ తరువాత రకరకాల కారణాలచేత ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు 'కొలీజియం వ్యవస్థే' నడుస్తుంది.

కానీ; అది 'పరాధీనం' గా వుండిపోయింది. ఈ మాట మనం చెప్పడం కాదు. ఏకంగా న్యాయమూర్తులే చెబుతున్నారు. అది 'జస్టిస్ అతుల్ శ్రీధరన్' బదిలీతో మరొక్కసారి రుజువయ్యింది.

**నన్నూరి వేణుగోపాల్**
**98494 49012**

# బెంగాల్ రాజకీయాల్లో మరో... రాజకీయ హింస

2011లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించినప్పుడు అది కేవలం ప్రభుత్వ మార్పు మాత్రమే కాదు. అది ఒక రాజకీయ భావోద్వేగ విస్ఫోటనం. "మా, మాటి, మనుష్" అనే నినాదం ద్వారా మమతా బెనర్జీ ప్రజలతో నేరుగా అనుసంధానం ఏర్పరుచుకున్నారు. మహిళా సంక్షేమ పథకాలు, పేదల పక్షపాత విధానాలు, గ్రామీణ వర్గాల మద్దతు ఆమెకు బలాన్ని ఇచ్చాయి. కానీ అధికారంలో ఎక్కువకాలం కొనసాగిన ప్రతి ప్రభుత్వంలాగే తృణమూల్ కాంగ్రెస్ కూడా అవినీతి ఆరోపణలు, రాజకీయ హింస, పరిపాలనా విమర్శలను ఎదుర్కొంటోంది. ఉపాధ్యాయ నియామక కుంభకోణం వంటి అంశాలు ప్రభుత్వ విశ్వసనీయతపై ప్రభావం చూపాయి.

ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీ బెంగాల్‌లో వేగంగా ఎదగడం దేశ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామం. 2016లో సుమారు 10% ఓట్లతో పరిమితమైన పార్టీ 2021 నాటికి 38% పైగా ఓట్లను సాధించడం చిన్న విషయం కాదు. ఇది కేవలం ఎన్నికల గణాంకం మాత్రమే కాదు. బెంగాల్ సమాజంలో మారుతున్న రాజకీయ ధోరణికి సంకేతం. జాతీయవాద భావజాలం, హిందుత్వ రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, తృణమూల్ వ్యతిరేక ఓట్ల సమీకరణ --- ఇవన్నీ కలిసి బిజెపికి బలాన్ని అందించాయి. ముఖ్యంగా యువత, పట్టణ మధ్యతరగతి, మొదటిసారి ఓటు వేస్తున్న వర్గాలలో బిజెపి ప్రభావం పెరుగుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇటీవల మే 4న కనిపించిన రాజకీయ సంకేతాలు కూడా ఈ మార్పు దిశను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, అవినీతి వ్యతిరేక భావజాలం, అభివృద్ధి ఆకాంక్షలు బిజెపికి అవకాశాలు కల్పిస్తున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే బెంగాల్ రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే అక్కడి ప్రాంతీయ గర్వాన్ని కూడా గుర్తించాలి. బెంగాలీ సంస్కృతి, భాష, సాహిత్యం, మేధో సంప్రదాయాలపై ప్రజలకు గాఢమైన అనుబంధం ఉంది. బయట నుంచి వచ్చిన రాజకీయ శక్తులను ప్రజలు సులభంగా అంగీకరించరు. అందుకే బిజెపి కూడా ఇప్పుడు స్థానిక నాయకత్వం, బెంగాలీ సంస్కృతి, ప్రాంతీయ భావజాలంపై ప్రత్యేక దృష్టి పెడుతోంది.

ప్రజాస్వామ్యంలో అసలు విజయం ఎన్నికల్లో గెలవడంలో మాత్రమే ఉండదు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ఉంటుంది. బెంగాల్ ప్రజలు చైతన్యవంతులు. వారు భావోద్వేగాలకు మాత్రమే లోనవ్వరు. అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్యం, శాంతిభద్రతలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలను కూడా గమనిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగం ఒక ప్రధాన సమస్యగా మారింది. యువత పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తోంది. పరిశ్రమల పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా కేవలం రాజకీయ నినాదాలతో ప్రజల విశ్వాసాన్ని ఎక్కువకాలం నిలబెట్టుకోవడం సాధ్యం కాదు.

బెంగాల్ రాజకీయాల్లో మరో ఆందోళనకర అంశం రాజకీయ హింస. ప్రతి ఎన్నికల సమయంలో ఘర్షణలు, దాడులు, ప్రాణనష్టం జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు. ప్రజలు భయంలేకుండా ఓటు వేయగలగాలి. విభిన్న అభిప్రాయాలను గౌరవించే రాజకీయ సంస్కృతి అవసరం. బెంగాల్ వంటి మేధో సంపన్న రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలు కొనసాగడం దేశ ప్రజాస్వామ్యానికి కూడా ప్రతికూల సంకేతమే అవుతుంది. అదే సమయంలో బెంగాల్‌లో మహిళా రాజకీయ చైతన్యం కూడా గణనీయంగా పెరుగుతోంది. మహిళా ఓటర్లు ఇప్పుడు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నారు. సంక్షేమ పథకాలతో పాటు భద్రత, విద్య, ఉపాధి, ధరల నియంత్రణ వంటి అంశాలను వారు ప్రాధాన్యంగా చూస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్ల నిర్ణయం కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

భారతదేశ రాజకీయ భవిష్యత్తులో బెంగాల్ పాత్ర మరింత కీలకంగా మారబోతోంది. ఉత్తర భారతదేశంలో బలంగా ఉన్న బిజెపి తూర్పు భారతదేశంలో కూడా స్థిరపడాలని చూస్తోంది. అదే సమయంలో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం కొనసాగాలని తృణమూల్ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ పోటీ కేవలం అధికార పోరాటం మాత్రమే కాదు. భారత రాజకీయాల భవిష్యత్ దిశను నిర్ణయించే భావజాల పోరాటంగా కూడా మారుతోంది.

చరిత్ర చెబుతున్న ఒక గొప్ప నిజం ఏమిటంటే ప్రజలను ఎవరూ శాశ్వతంగా మోసం చేయలేరు. కొంతకాలం భావోద్వేగాలతో, నినాదాలతో, రాజకీయ ప్రచారాలతో ప్రజలను ప్రభావితం చేయవచ్చు. కానీ చివరకు ప్రజలు తమ జీవన పరిస్థితులను ఆధారంగా చేసుకుని తీర్పు ఇస్తారు. బెంగాల్ ప్రజలు గతంలో అదే చేశారు. భవిష్యత్తులో కూడా అదే చేస్తారు. అందుకే బెంగాల్ రాజకీయాలను దేశ ప్రజాస్వామ్యానికి ఒక పరీక్షగా భావిస్తారు. చివరికి చెప్పాల్సింది ఒక్కటే. బెంగాల్ ప్రస్తుతం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారా? లేక స్థిరత్వాన్ని కొనసాగించాలనుకుంటున్నారా? అనే ప్రశ్నకు సమాధానం రాబోయే ఎన్నికలు ఇస్తాయి. కానీ ఏ పార్టీ అధికారం లోకి వచ్చినా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాల్సిందే. నిరుద్యోగం తగ్గించాలి. పరిశ్రమలను తీసుకు రావాలి. రాజకీయ హింసను అరికట్టాలి. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి. పారదర్శక పరిపాలన అందించాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యం. అదే బెంగాల్ ప్రజలు కోరుకుంటున్న అసలు మార్పు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# రోగుల వైద్య సేవలలో నర్సుల పాత్ర అనిర్వచనీయం



శేరిలింగంపల్లి, మే 12 (జనంసాక్షి) : అనారోగ్యంతో ఇబ్బందులను ఎదుర్కొంటూ ఆపదలో ఉన్న రోగిని తన నిరంతర పర్యవేక్షణతో సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా నిలబెట్టడానికి నర్స్ నిర్వహించే పాత్ర అనన్య సామాన్యమని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని పద్మా అపార్ట్ మెంట్ లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలనువేసి క్రొవ్వత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిహెచ్ఇఎల్ జనరల్ హాస్పిటల్ డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. పుట్టరాజు హాజరు కావడం జరిగింది. పుట్ట రాజు తోపాటు సత్య సాయి సేవ సమితి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ డాక్టర్ బి.సి రామన్న, సామాజిక కార్యకర్త ఈ. దేవానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధులు మే12వ తారీఖున ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక నినాదంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం 'మన నర్సులు - మన భవిష్యత్తు - సాధికారులైన నర్సులు మన ప్రాణాలను కాపాడతారు' అనే నినాదంతో నిర్వహించడం జరిగిందన్నారు. మానవులకు సేవ చేయడానికి భగవంతుడు కల్పించిన అద్భుత అవకాశమే వైద్య రంగం అని తెలియజేశారు. దీనిలో ప్రధానమైంది నర్సింగ్ వృత్తి అని, రోగులకు వైద్యులు యిచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవకూడా అంతే ముఖ్యని రామస్వామి యాదవ్ తదితరులు గుర్తు చేశారు. ఈ క్రమంలో పాత విషయాలను గుర్తు చేసే క్రమంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ 1812 మే 12వ తేదీన ఇటలీలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారని, ఆ రోజులలో వైద్యశాలలు శుచి, శుభ్రత లేకుండా అధ్వాన్నస్థితిలో ఉండేవని అన్నారు. నైటింగేల్ తన తల్లిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా సేవ చేయడానికై నర్సింగ్ వృత్తిని యెంచుకొని జర్మనీ, ఐర్లాండ్ లలో పనిచేసి అక్కడ వైద్యశాలల పరిస్థితులలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి మెరుగుపరచి తిరిగి లండన్ వచ్చి అక్కడ హాస్పిటళ్ళలో పరిశుభ్రతకు ప్రాధాన్యతతో పాటు రోగులకు పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాటు చేసిందని కొనియాడారు. 1854లో క్రీమియాలో ఘోర యుద్ధం జరిగిందని, ఆ యుద్ధంలో క్షతగాత్రులైన సైనికులకు తోటి నర్సులను కూడగట్టుకుని నిరుపమానమైన సేవలు అందించినట్టు వారు వివరించారు. ఎంతో గుండె నిబ్బరంతో చిమ్మచీకట్లలో చిరుదీపం వెంట తీసుకుని వెళ్ళి రోగులకు సేవలందించి, వారిలో బ్రతుకుతామనే ఆశలను చిగురింపజేసిందని, వారి ముఖాలపై చిరునవ్వులు ఆమె చేతిలోని దీపంలాగా వెలిగాయని, ఇది ఒక మహోన్నత కార్యక్రమంగా వారు అభివర్ణించారు. అందుకే ఫ్లోరెన్స్ నైటింగేల్ ను 'మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సింగ్'గా ప్రపంచం గుర్తించిందన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ సూచనలు, సలహాల మేరకు భారతదేశంలో శానిటరీ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దాని వల్ల మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గడం జరిగిందని పునరుద్ఘాటించారు. నర్స్ అనే ఆంగ్ల పదం ను తెలుగులోకి అనువదిస్తే మహోన్నతమైన, అవగాహన, బాధ్యత, సానుభూతి, సమర్థవంతమైన సేవలు అందించేదే అనే అర్థం వస్తుందన్నారు. కనిపించే దేవుళ్ళు వైద్యులైతే కాపాడే దేవతలే నర్సులని రామస్వామి యాదవ్ తదితరులు స్లాఘించారు. అనంతరం నర్సులచేత 'రోగులకు అంకితభావంతో మెరుగైన సేవలు అందిస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మానవసేవే మాధవసేవగా భావించి వివిధ ప్రభుత్వ వైద్యశాలలో (నిమ్స్, లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రంగారెడ్డి జిల్లా ఆసుపత్రి, కొండాపూర్, ఏరియా హాస్పిటల్, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ తదితర అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులపట్ల ప్రేమానురాగాలు చూపిస్తూ వైద్య సేవలందించిన సేవామూర్తులైన 80 మంది నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుతో పాటు శాలువ, జ్ఞాపిక, పగిడిలతో ఘనంగా సత్కరించారు. సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నండూరి వెంకటేశ్వర రాజు, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జివి రావు, సత్యనారాయణ, వాణిసాంబ శివరావు, విజయలక్ష్మీ, విష్ణుప్రసాద్, బాలాజీ, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



తెలకపల్లి, మే 12 (జనం సాక్షి) : మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పార్టీలు అన్నారు మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం, తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొనసాగుతున్న మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. రైతులు పండించిన విక్రయానికి తీసుకువచ్చిన మొక్కజొన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన పంట తేమ శాతం నిర్ధారణ, తూకం విధానం, నిల్వ ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్న గోదాముల్లో నిలువ ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మద్దతు ధర ప్రకారం రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ ,జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రఘునాథ్ రావు , కోపరేటివ్ అధికారులు, పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు తీరని కష్టాలు

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



కొల్చారం, మే 12 (జనం సాక్షి) : యాసంగి ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయి. కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి రైతు వేదిక వద్ద రైతులతో వడ్ల కొనుగోలు విషయమై లారీల గురించి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను తీవ్రంగా వేధిస్తున్న లారీలు, గోనెసంచుల కొరత ఆరుగాలం కష్టపడి పండించిన యాసంగి వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సకాలంలో కొనుగోళ్లు జరగకపోవడం, గోనెసంచుల కొరత కారణంగా ధాన్యాన్ని రాశులుగా పోసి రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే అన్నారు. నిబంధనల మేరకు 17% వచ్చేవరకు ఆరబోసి రాసి పోసి పక్షం రోజులు గడుస్తున్న తూకం కావడం లేదు. ఒకవేళ తూకం అయిన లోడింగ్ కు మరో 15 రోజులు పడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు ఇదిగో వస్తున్నా, అదిగో వస్తున్నాయి అని చెబుతూ కాలం వెళ్లదీయడమే తప్ప క్షేత్రస్థాయి అధికారులు కొనుగోలను వేగిరం చేసే చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అని ఎమ్మెల్యే అన్నారు.సోమవారం సాయంత్రం పోతంశెట్టిపల్లి చౌరస్తా వద్ద సుమారు మూడు తులాలనర బంగారు పుస్తెలతాడు దొంగిలించబడ్డ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు సంతోష్ కుమార్, కోనాపూర్ సంతోష్ రావు, సాయిని సిద్ధిరాములు, మహేష్, యాద గౌడ్, రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల్లోగా వడ్లు కొనకపోతే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతాం

- రైతాంగాన్ని గోస పెట్టుడు బంజేయండి
- ప్రకృతి వనరుల దోపిడీ ఆపండి
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీశైల్ రెడ్డి పంజుగుల హెచ్చరిక




యాలాల, మే 12 (జనంసాక్షి) : రైతాంగాన్ని గోస పెట్టుడు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బంద్ చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీశైల్ రెడ్డి పంజుగుల పేర్కొన్నారు.మంగళవారం యాలాల్ మండల పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రవీందర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన రైతు దీక్ష కార్యక్రమం విజయవంతమయింది. ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాదు, ముఖ్యకంత్రి అన్నారు. ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ, యూరియా ఏదీ ఇవ్వకున్నా రైతులు శ్రమించి పంట పండిస్తున్నరు. మీరు కొనేది పోయి ఉల్టా వాళ్ళను గోస పెడుతున్నరు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ మాజీ సీఎం కెసిఆర్ హయాంలో 70 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద ఎకరాకు ఏటా రూ. 10 వేల చొప్పున 6 ఏళ్లలో 11 విడతల్లో రూ. 72,808 కోట్ల పెట్టుబడి సాయం అందించారని తెలిపారు.అంతేకాకుండా 46 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు రైతు బీమా పథకం ద్వారా చనిపోయిన ప్రతి రైతు కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించామని, 3,000 మందికి పైగా రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు.రాష్ట్రంలో 5700 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానిదేనని నాయకులు స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నా, బాధ్యత వహించి ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి 'పొట్ట దశలో ఉన్న పంటలు ఎండబెట్టకండి' అంటే, అప్పుడు నీళ్ళు ఒదిలిన్రు. కానీ, ముఖ్యకంత్రికి మాత్రం రైతుల పట్ల సోయి లేదని విమర్శించారు. ముఖ్యకంత్రి ఇంట్లో నలుగురు ముఖ్యకంత్రిలు, ఎమ్మెల్యే ఇంట్లో ఇద్దరు ఎమ్మెల్యేలు ఏం పీకుతున్నరని మండిపడ్డారు.రైతాంగాన్ని గోస పెట్టుడు బంజేయండి; ప్రకృతి వనరుల దోపిడీ ఆపండి. తాండూరు కాంగ్రెస్ నాయకులు కూడా ఆలోచించాలి, రేవంత్ రెడ్డి మీ పార్టీని ముంచుతున్నడు. ప్రజా సమస్యల విషయంలో బీఆర్ఎస్ పోరాటం ఆగదు. పోలీసులు చట్టప్రకారం నడవాలి, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, నిర్బంధాలు ఆపండి. లేకపోతే న్యాయపోరాటం తప్పదన్నారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కొనుగోలు కేంద్రాలు నడవకుండా చూస్తున్న ఎమెల్యే.ధాన్యం కొనేందుకు లంచాలు అడుగుతున్న అధికారులు. కోడంగల్ రేవంత్ రెడ్డి ఇంట్లో, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఇంట్లో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంట్లో ధాన్యం గుమ్మరిస్తం. రాబోయే పంచాయత్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించి మన హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. దీక్షను ఉద్దేశించి మాట్లాడినవారిలో తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ సర్పంచ్ బసిరెడ్డి, కౌన్సిలర్లు సంతోష్, జావేద్; నాయకులు శివ్, పాండురంగా రెడ్డి, రాకేశ్, నారాయణ, శరణ్ కుమార్ ఉన్నారు. సీనియర్ నాయకులు పట్లోళ్ళ నర్సిములు, వెంకట్ రెడ్డి, మల్లా రెడ్డి, నర్సిరెడ్డి సహా శేఖర్ రెడ్డి, చిట్టి, రాములు, సిద్ధారెడ్డి, అరవింద్, గోరేపల్లి రవిగౌడ్; కౌన్సిలర్లు ఇర్షాద్, కరుణాకర్, యోగి, సురేష్, ఇజాజ్, అనంత్ రెడ్డి, బీఆర్ఎస్వి నాయకులు దత్తాత్రేయ, అగ్గనూర్ దత్తు, పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. దీక్షకు ముందు నాయకులు బెన్నూరు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడి, వారికి అండగా ఉంటామని, ప్రభుత్వంపై జంగ్ చేద్దామని, హక్కులు సాధించుకుందామని భరోసా ఇచ్చారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి



గద్వాల నడిగడ్డ, మే 12 (జనం సాక్షి) : వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా సజావుగా కొనుగోలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ (రెవిన్యూ) సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు విషయంపై మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత లేకుండా, రవాణా, హమాలీల, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కొనుగోళ్ల విషయంలో ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి లేకుండా త్వరితగతిన ధాన్యమును కొనుగోలు చేయాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ గోదాములు సరిపోకుంటే ప్రైవేట్ గోదాములను కూడా అద్దెకు తీసుకొని ధాన్యాన్ని భద్రపరచాలన్నారు. అవసరమైతే రైతు వేదికలు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్ లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు విషయంలో బాధ్యత వహించాలని, నిబద్ధతతో పనిచేసి రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డిఏఓ వీరప్ప, సక్రియ నాయక్, మార్కెడ్ డీఎం చంద్రమౌళి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చేతుల మీదుగా లక్ష నగదును పొందిన పసునూటి సుమశ్రీ




నూతనకల్, మే 12 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతులమీదుగా లక్ష రూపాయల నగదు బహుమతిని మండల పరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పసునూటి నాగేశ్వర్,ఉమ దంపతుల రెండవ కూతురు పసునూటి సుమశ్రీ సోమవారం పొందారు. ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో రాష్ట్ర ర్యాంక్ సాధించిన టాపర్లకు హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా జి జె సి రాష్ట్ర టాపర్లకు, ప్రిన్సిపాల్ లకు సన్మానం,నగదు బహుమతులు అందజేశారు.

## భూ నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




జడ్చర్ల, మే 12 (జనంసాక్షి) : ఉదండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుష్బు గుప్తాతో కలిసి భూనిర్వాసితుల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, మిషన్ భగీరథ నీటి సరఫరా అంశాలపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన పునరావాసం, పరిహారం, మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అర్హులైన ప్రతి కుటుంబానికి అత్యంత పారదర్శకంగా అందేలా చూడాలని, అధికారులు నిర్వాసితుల సమస్యలను సానుభూతితో పరిశీలించి క్షేత్రస్థాయిలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని సూచించారు. అనంతరం జడ్చర్ల నియోజకవర్గంలోని మిషన్ భగీరథ నీటి సరఫరా పరిస్థితిపై ఎమ్మెల్యే సమీక్షించారు. వేసవి నేపథ్యంలో గ్రామాలు, తండాలు, కాలనీలకు అంతరాయం లేకుండా తాగునీటిని అందించాలని అధికారులను కోరారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులు లేదా ఇతర సాంకేతిక లోపాలు తలెత్తితే వాటిని త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, జడ్చర్ల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 12 (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లాలో రైతుల నుంచి మొక్కజొన్న, వరి కొనుగోళ్లు పారదర్శకంగా మరియు వేగవంతంగా కొనసాగుతున్నాయని హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లాలో మొక్కజొన్న ఇప్పటివరకు 60 శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిందని, రానున్న పది రోజుల్లో 90శాతం మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కనీస మద్దతు ధరలతో పంట కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులు ఎటువంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ పంటలను తీసుకురావాలని జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 15 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు గోదాంల నిల్వ మరియు హమాలీల సమస్య కారణంగా కొంత ఇబ్బందులు గురి కావడం జరిగిందని, జిల్లా యంత్రాంగం రైతులను దృష్టిలో ఉంచుకొని సమస్యలను అధిగమించేలా రవాణా, మరియు జిన్నింగ్ మిల్లుల నిల్వలు ఉంచడం ఎందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిందని రానున్న వారం రోజుల్లో సమస్యను అధిగమించి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. హమాలీల సమస్యను అధిగమించేలా స్థానికంగానే ఉండే హమాలీలతో సమస్యలను పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలోని రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు తేమ శాతం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ధాన్యంలో అధిక తేమ ఉండడం వల్ల కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులకు మీడియా ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించి, అవసరమైన తేమ శాతంతో ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. దీంతో ధాన్యం పూర్తిస్థాయిలో, వేగంగా కొనుగోలు చేయడం సాధ్యమవుతుందని తెలిపారు.రైతులకు చెల్లింపుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించినా లేదా కొనుగోలు ప్రక్రియలో అవకతవకలు జరిగినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ఉన్న జిన్నింగ్ మిల్లులను రైతుల నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్న నిలువ ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందన్నారు, కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని, ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల పనితీరును సమీక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు.జిల్లాలో అకాల వర్షాలు సంభవిస్తానని అందుకు ముందస్తుగా రైతులకు చేరే విధంగా చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో మీడియా సహకారం అవసరమని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా పనిచేస్తారని తెలిపారు.

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

- సమగ్రసమాచారం దేశాభివృద్ధికి పునాది..
- మారథాన్ వాక్ అవగాహన ర్యాలీకి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి టౌన్, మే 12 (జనం సాక్షి) :** జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర మరియు ఖచ్చితమైన సమాచారం దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అని అన్నారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి ఐబీ వరకు నిర్వహించిన "జనగణన అవగాహన మారథాన్ వాక్" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. జిల్లాలో జనగణన ప్రక్రియలో భాగంగా మే 10 వరకు స్వీయ గణన నిర్వహించగా, మే 11



నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. జనగణన సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశామని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. జనగణనలో సేకరించే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాల రూపకల్పన మరియు అమలులో ఉపయోగపడుతుందని తెలిపారు. దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, రెవెన్యూ,పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, ఆశా వర్కర్లు,వివిధ కళాశాలల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, యువత,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



**పెబ్బేరు, మే 12 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల బలోపేతం, నిధుల సమర్థ వినియోగంపై స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ తెలంగాణ ప్రాంతీయ స్థానిక సంస్థల సదస్సులో భాగంగా తెలంగాణ రాష్ట్ర 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం రంగారెడ్డి జిల్లాలో నిర్వహించారు. ఆర్థిక సంఘం బలోపేతానికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ విన్నవించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి మున్సిపాలిటీ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి పెబ్బేరు మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, ఖాజా ఆర్ఫదిన్ తదితరులు హాజరయ్యారు.

## రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రం ప్రారంభించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 12 (జనం సాక్షి) :** జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నెల రోజుల ప్రత్యేక సభ్యత్వ నమోదు కేంద్రాన్ని కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి హాల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రారంబించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చట్టభద్ధంగా ఏర్పడ్డ ఒక స్వచ్ఛంద సేవా సంస్థ అన్నారు. ప్రజలకు విపత్తుల్లో సేవలందిస్తుందనీ తెలిపారు. అందుకే ప్రజలు ఈ సంస్థ లొ అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకొని సేవలు అందించాలని కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమం లొ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కె. సుదర్శన్ రెడ్డి తోపాటు, రాష్ట్ర రెడ్ క్రాస్ ఎం సి మెంబెర్ ఆత్మరామ్, జిల్లా జూనియర్, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ లు జొన్నల సుభాష్, నందు పటేల్, రెడ్ క్రాస్ పాట్రన్ జి. ఆర్. రెడ్డి మున్సిపల్ వైస్ చైర్పర్సన్ మంజుల, సభ్యులు ఉమేష్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన పకడ్బందీగా నిర్వహించాలి



**కృష్ణ, మే 12 (జనం సాక్షి) :** జనగణన పకడ్బందిగ నిర్వహించాలని కృష్ణ తహసీల్దార్ బి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముడుమాల గ్రామంలో జరుగుతున్న జన గణన ప్రక్రియను మంగళవారం కృష్ణ మండల తహశీల్దారు బి. శ్రీనివాస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ దండు శేఖర్, ఎన్యూ మరేటర్లుకుర్మన్న,రమేష్,తిమ్మప్ప, భారతి,రవికుమార్, పంచాయతీ అధికారి సునిత,సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల సంక్షేమం అందరి బాధ్యత



**ఇటిక్యాల, మే 12 (జనం సాక్షి) :** బాలల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుంచుకొని పనిచేయాలని బాలల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ శివలీల గ్రామస్తులకు సూచించారు. మంగళవారం ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ మహేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బాలల సమస్యలపై కమిటీలోని సభ్యులందరితో చర్చించినట్లు తెలిపారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాల్య వివాహ నిషేధిత చట్టం, వాళ్ళ వివాహ నిరోధక అధికారులను నియమించడం జరిగిందన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదని, బాలికలను చదివించాలని గ్రామస్తులకు సూచించారు. ఆడపిల్ల ఉన్న తల్లిదండ్రులు వారి భవిష్యత్తు కోసం పొదుపుని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కౌసల్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ పరమేశ్వరి, అంగన్వాడీలు, ఆశాలు ఉన్నారు.

# విద్యార్థుల్లో క్రమశిక్షణ, సంస్కారం పెంపొందించాలి

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా పరిషత్ సీఈఓ సి.హెచ్. ఎల్లయ్య

**తూప్రాన్, మే 12 (జనం సాక్షి) :** ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును మెదక్ జిల్లా పరిషత్ సీఈఓ తూప్రాన్ మండల పరిషత్ ప్రత్యేక అధికారి సి. హెచ్. ఎల్లయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసుకునే అవకాశంగా వేసవి క్యాంపు గా భావించాలని అన్నారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతా భావం కూడా విద్యార్థులకు ఎంతో



అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కళలు, క్రీడలు, యోగ, సంభాషణా నైపుణ్యాలు వంటి అంశాల్లో కూడా అభివృద్ధి చెందాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే చిన్ననాటి నుంచే పట్టుదల, ఆత్మవిశ్వాసం, సమయపాలన అలవర్చుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని అన్నారు. తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో విద్యార్థుల మానసికోల్లాసం, సృజనాత్మకత పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి డా. పర్వతి సత్యనారాయణ తెలిపారు. ఈ క్యాంపులో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగ, డాన్స్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఏపీపీసీ చైర్పర్సన్ శ్రీమతి ఓ. కరుణశ్రీ, ఉపాధ్యాయులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం కోసం స్థల పరిశీలన



**వనపర్తి బ్యూరో, మే 12 (జనంసాక్షి) :** జిల్లా కాంగ్రెస్ పార్టీకి శాశ్వత జిల్లా కార్యాలయ నిర్మాణం దిశగా కీలక అడుగులు పడబోతున్నాయని, పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా ప్రశాంత వాతావరణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన కార్యాలయాన్ని నిర్మించేందుకు చర్యలు ప్రారంభమైనట్లు వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి రాజపేట శివారులోని 73 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, హద్దులను గుర్తించారు. సుమారు ఒక ఎకర విస్తీర్ణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ... స్థల పరిశీలన అనంతరం కార్యాలయ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేసి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్మాణ కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ నేతృత్వంలో త్వరలో కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, గంధం శరవంద, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ సర్వేర్లు ఉన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ క్రైమ్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



**వనపర్తి బ్యూరో, మే 12 (జనంసాక్షి) :** మహిళలు దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా ఎదగాలంటే సామాజిక, ఆర్థిక బలోపేతం అవసరమని మహిళా సాధికార కేంద్రం సిబ్బంది సుమ పేర్కొన్నారు. వనపర్తి మండలంలోని కిష్టగిరి గ్రామంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వారిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలు దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా ఎదగాలంటే సామాజిక, ఆర్థిక బలోపేతం అవసరమని పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఆర్థిక మోసాల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పూర్తి ఆర్థిక అక్షరాస్యత సాధించాలని కోరారు. అలాగే సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలల సహాయానికి 1098, సైబర్ క్రైమ్ ఫిర్యాదులకు 1930, మహిళల గృహహింస సహాయానికి 181, పోలీస్ సహాయానికి 100, వయోవృద్ధుల సహాయానికి 14567 టోల్ ఫ్రీ నంబర్ల ఉపయోగాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార కేంద్రం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# వైద్య రంగానికి మంత్రి వాకిటి శ్రీహరి పెద్దపీట

- ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**మక్తల్, మే 12 (జనంసాక్షి) :** వైద్య రంగానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పెద్దపీట వేస్తున్నారని, మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో 150 పడకల ఆసుపత్రిని అతి త్వరలో పూర్తిచేసి నియోజకవర్గ వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని 16వ వార్డు కౌన్సిలర్ అల్కురి పావని అన్నారు. మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మక్తల్ ఆసుపత్రిలో నర్సులకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా అల్కురి పావని మాట్లాడుతూ వైద్యరంగంలో నియోజకవర్గానికి మంత్రి వాకిటి శ్రీహరి పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగానే ఏకంగా 64 మంది నర్సులు ప్రస్తుతం పని చేస్తున్నారని, 150 పడకల ఆసుపత్రి పనులు సైతం శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే దసరాలోపు ఆసుపత్రిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారని తెలిపారు. మక్తల్ ఆసుపత్రితో మంత్రి వాకిటి శ్రీహరికి విడదీయరాని అనుబంధం ఉందని, వారి తల్లి రాములమ్మ సైతం నర్సుగా దశాబ్దాల పాటు పనిచేశారని, ఆమె ఎనలేని సేవ చేశారని కొనియాడారు. మక్తల్ ప్రాంతంలో వైద్యం కోసం ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలు 150 పడకల ఆసుపత్రిలోని అందించే విధంగా మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వినుత, సన్మాన గ్రహీతలు స్టాఫ్ నర్స్, కోఆప్షన్ నెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ శాలం, 16వ వార్డు స్థానిక నాయకులు రామ్



నారాయణ, టింగిల్ గోపాల్ ,ఏ.రవికుమార్, రంజాన్, సయ్యద్ సలీం ,మహమ్మద్, అమ్రేష్, గఫర్, వినయ్, సంతోష్, కడేచూర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో క్రమశిక్షణ సంస్కారం పెంపొందించాలి

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా పరిషత్ సీఈఓ సి.హెచ్. ఎల్లయ్య

**తూప్రాన్, మే 12 (జనం సాక్షి) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును మెదక్ జిల్లా పరిషత్ సీఈఓ తూప్రాన్ మండల పరిషత్ ప్రత్యేక అధికారి సి. హెచ్. ఎల్లయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసుకునే అవకాశంగా వేసవి క్యాంపు గా భావించాలని అన్నారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతా భావం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కళలు, క్రీడలు, యోగ, సంభాషణా నైపుణ్యాలు వంటి అంశాల్లో కూడా అభివృద్ధి చెందాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే చిన్ననాటి నుంచే పట్టుదల, ఆత్మవిశ్వాసం, సమయపాలన అలవర్చుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని అన్నారు. తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో విద్యార్థుల మానసికోల్లాసం, సృజనాత్మకత పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి డా. పర్వతి సత్యనారాయణ తెలిపారు. ఈ క్యాంపులో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగ, డాన్స్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో



ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఏపీపీసీ చైర్పర్సన్ శ్రీమతి ఓ. కరుణశ్రీ, ఉపాధ్యాయులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

**జడ్చర్ల, మే 12 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి, ప్రజాసేవకు ఆకర్షితులై మంగళవారం పోలేపల్లి గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వార్డు సభ్యులు సల్మాన్, యాదయ్య, అనూష శివ, ఎరుకలి కర్రెమ్మలతో పాటు పానుగంటి రమేష్, జ్యోతి శంకర్ నాయక్, సరిత చంద్రమౌళి తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే పనితీరుపై నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు నాయకులు స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
13 మే 2026

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- మిల్లుల వద్ద అన్ లోడింగ్ వేగవంతానికి చర్యలు
- జిల్లా కలెక్టర్ తేజస్ నందా లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మే 12 (జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అకాల వర్షాల ముప్పును దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.జిల్లాలో ఈ సీజన్‌లో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేయగా, సోమవారం వరకు 2 లక్షల మెట్రిక్ టన్నులను విజయవంతంగా సేకరించామని తెలిపారు.నిరంతర పర్యవేక్షణ, అధికారులతో ప్రతిరోజూ సమీక్షలు నిర్వహించడం వల్లనే ఇంత పెద్ద మొత్తంలో సేకరణ సాధ్యమైందని పేర్కొన్నారు.మిల్లుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియ నెమ్మదించడంపై అసహనం వ్యక్తం



చేశారు.ముఖ్యంగా హమాలీల కొరత వల్ల అన్ లోడింగ్ ఆలస్యమవుతుందని, దీని వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను రెండింతలు పెంచి, మూడు షిఫ్టుల్లో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు.ధాన్యం దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రైవేట్, అదనపు గోదాములను అద్దెకు తీసుకుని ధాన్యాన్ని నిల్వ చేయాలని సూచించారు.ధాన్యం తరలింపు కోసం ప్రస్తుతం ఉన్న 670 లారీలు సరిపోవడం లేదని, అదనపు లారీలు, డీసీఎంలను ఏర్పాటు చేసేందుకు పోలీస్, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.కొనుగోలు కేంద్రం నుండి మిల్లుకు 5 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే, లారీల కోసం వేచి చూడకుండా ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద గన్నీ బ్యాగులు, హమాలీలు అందుబాటులో ఉండేలా తహసీల్దార్లు, మండల అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మిల్లు వద్ద అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక ఇంచార్జ్ అధికారిని నియమించాలని సూచించారు.అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పని చేసి రైతులకు న్యాయం చేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జిల్లా పరిషత్ సీఈవో శిరీష,డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎస్ఓ మోహన్ బాబు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎమ్ఓ నాగేశ్వర్ శర్మ, సివిల్ సప్లై డీఎం శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 12 (జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.మంగళవారం నాగారం, జాజిరెడ్డి గూడెం, తిరుమలగిరి మండలాల్లోని తిమ్మాపురం, ఇటూరు, తొండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.అనంతరం నాగారం, తిరుమలగిరి పరిధిలోని వాసవి రైస్ ఇండస్ట్రీ, ఏఎస్ఆర్ రైస్ ఇండస్ట్రీ , సోమేశ్వర రైస్ ఇండస్ట్రీ మిల్లులను సందర్శించి, ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఝాన్సీ, తిరుమలగిరి తహశీల్దార్ కంట్లమయ్య, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాములపాడు పశు వైద్యశాలకు గ్రహణం

- సిబ్బంది రాక కోసం రైతుల నిరీక్షణ మూగజీవాల ప్రాణాలతో చెలగాటం

**మాడుగులపల్లి, మే 12 (జనం సాక్షి) :** ప్రభుత్వం పశుసంపదను రక్షించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నీరుగారుతోంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామ పశు వైద్యశాల సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి ఆసుపత్రికి సిబ్బంది రాకపోవడం, వచ్చినా గంట సేపు కూడా అందుబాటులో ఉండకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పాములపాడు గ్రామం మండల కేంద్రానికి కొంత దూరంగా



ఉండటాన్ని సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది పర్యవేక్షణ చేసే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు ఉదయం ఆలస్యంగా రావడం, వచ్చిన కొద్దిసేపటికే ఫీల్డ్ విజిట్ పేరుతో ఆసుపత్రికి తాళం వేసి వెళ్లిపోవడం ఇక్కడ నిత్యకృత్యమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వేసవి కాలంలో పశు వులకు గొంతువాపు, గాలికుంటు వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది ఇలాంటి కీలక సమయంలో వైద్యశాల అందుబాటులో లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు పశు వులకు అత్యవసర చికిత్స అవసరమైనప్పుడు సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు వైద్యశాల ఎప్పుడు తెరుస్తారో ఎప్పుడు మూస్తారో తెలియదు పశువులకు జబ్బు చేస్తే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదు అని స్థానిక పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు తక్షణమే స్పందించి, పాములపాడు పశు వైద్యశాల సిబ్బందిపై విచారణ జరపాలని, వారు క్రమబద్ధంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు లేని పక్షంలో ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతామని హెచ్చరిస్తున్నారు.

## ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ సేవలు అభినందనీయం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మే 12 (జనంసాక్షి) :** ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం పిల్లలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారి ఆర్థిక సహాయంతో ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో పాఠశాలలో మరమ్మతులు, సుందరీకరణ పనులు, టాయిలెట్స్ పనులు, స్టీమ్ ల్యాబ్ ఏర్పాటుతో పాటు విద్యార్థులకు కావలసిన




క్రీడా సామాగ్రి అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై మాట్లాడుతూ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థను అభినందిస్తూ వారి యొక్క సేవలు మరువలేనివని అన్నారు.ముమ్ముందు కూడా జిల్లాలోని పాఠశాలలను దత్తత తీసుకొని కావాల్సిన మౌలిక సదుపాయాలు, మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు ల్యాబ్స్, క్రీడా సామాగ్రిని అందించి అభివృద్ధి చేయాలని అన్నారు.విద్యార్థులు కూడ వీటిని ఉపయోగించుకొని నైపుణ్యం పెంచుకోని మంచిగా చదువుకోవాలని, చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి ఉపాధ్యాయులను, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం జనార్ధన్,తహశీల్దార్ కృష్ణయ్య ,జిఐసి ప్రతినిధులు శ్వేత, శుభధ, ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు శారద,జయరాజ్ మెహతా, శ్రావణ్ జైస్వాల్, వార్డ్ కౌన్సిలర్ నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సోమమ్మ, ఉపాధ్యాయులు,విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ సిటీ, మే 12 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పదవ తరగతిలో వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన వారికి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో రెమిడియల్ క్యాంప్ పేరిట ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శంకర్ భవన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతోనూ భేటీ అయ్యారు. ఒకటి, రెండు సబ్జెక్టులలో తప్పిపోయినంత మాత్రాన అనవసర ఆందోళనకు గురి కావద్దని సూచించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు మరో మూడు వారాల వరకు సమయం మిగిలి ఉన్నందున ఏకాగ్రతతో శ్రద్ధగా చదువుకోవాలని, శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. మీరు మీ కోసం కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే, మీ తల్లిదండ్రులు కూడా ఎంతో



సంతోషిస్తారని అన్నారు. జీవితంలో ఓటములు ఎదురవడం సహజమేనని, వాటిని భవిష్యత్తు విజయాలకు సోపానాలుగా మార్చుకోవాలని హితవు పలికారు. ఉన్నత స్థానాలకు చేరాలంటే షార్ట్ కట్స్ అంటూ ఏవీ ఉండవని, విద్యార్థి దశలో కష్టపడితే జీవితం అంతా సుఖ సంతోషాలతో గడపవచ్చని మార్గనిర్దేశం చేశారు. స్పష్టమైన గమ్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీలో మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని,సెల్ ఫోన్లను కొన్నాళ్ళ పాటు పక్కన పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కట్టడి చేయాలని, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం స్మార్ట్ ఫోన్ల విషయంలో కొంత కటువుగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

### సమ్మర్ క్యాంప్ ను సందర్శించిన కలెక్టర్

కాగా, వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల కోసం శంకర్ భవన్ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాలలో అందిస్తున్న తర్ఫీదు గురించి ఆరా తీశారు. చిన్నారులతో కలెక్టర్ ముచ్చటిస్తూ వారి అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి సెలవులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని, డాన్స్, సింగింగ్, ఇండోర్ గేమ్స్ వంటి వాటిలో మెళుకువలను నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు వేస్తూ, చక్కగా సమాధానాలు ఇచ్చిన చిన్నారులకు కలెక్టర్ ప్రత్యేకంగా బహుమతులు, చాక్లెట్లు అందజేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి పి. అశోక్, ఎంఈఓ లు సాయిరెడ్డి, అరవింద్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయన్న తదితరులు ఉన్నారు.

## దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- జామాయిల్ కర్రలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ను ఢీకొన్న కారు
- క్షతగాత్రులు సిద్ధిపేట వాసులు
- ఇద్దరి పరిస్థితి విషమం...ముగ్గురికి గాయాలు

**బూర్గంపహాడ్, మే 12 (జనంసాక్షి) :** హనుమాన్ జయంతి నేపథ్యంలో దైవదర్శనం నిమిత్తం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వెళుతుండగా బూర్గంపహాడ్ మండలం సారపాక వద్ద జామాయిల్ కర్రలోడుతో వెళుతున్న ట్రాక్టర్ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సిద్ధిపేట జిల్లా నంగనూర్ మండలం వెంకటాపూర్కు చెందిన పులిగిళ్ల లింగప్రసాద్, నక్కా కుమార్యాదవ్, బొమ్మిడి శ్రీనివాసరెడ్డి, నాయిని సంపత్రెడ్డి, చంద్రశేఖర్ లు కారులో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి



దేవాలయానికి దైవదర్శనం నిమిత్తం వచ్చారు. వీరంతా హనుమాన్ భక్తులు కావడం... దీక్ష తీసుకుని ఉండటంతో దర్శనం అనంతరం దీక్షలు విరమించి తిరుగు ప్రయాణంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే క్రమంలో బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో ఎదురుగా జామాయిల్ కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న మెకానిక్గా జీవనం సాగిస్తున్న పులిగిళ్ల లింగప్రసాద్, ఎ.చంద్రశేఖర్లకు తీవ్రగాయాలవ్వగా మిగిలిన ముగ్గురు న్యాయవాదిగా పనిచేస్తున్న నక్కా కుమార్ యాదవ్, బైక్ మెకానిక్ బొమ్మిడి శ్రీనివాసరెడ్డి, నాయిని సంపత్రెడ్డిలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా లింగప్రసాద్, చంద్రశేఖర్ల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్కు తరలించారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డు ప్రమాదానికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని...అకస్మాత్తుగా మలుపుతిప్పడంతో వెనుక నుంచి వచ్చే వాహనం ఢీకొట్టి ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుస్టేషన్లో ఇప్పటివరకు ఎలాంటి కేసునమోదు కాలేదు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులకు తీరని కష్టాలు

**కౌడిపల్లి, మే 12 (జనంసాక్షి) :** నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత రెడ్డి, మంగళవారం నాడు మండల కేంద్రమైన కౌడిపల్లి మండల కేంద్రం లోని 765 జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి, మాట్లాడుతూ... రైతులు ఆరుకాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలిస్తే 30 నుండి 40 రోజుల వరకు తూకం వేయకుండా రైతుల ను అస్తవ్యస్తంగా బాధపెడుతుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాను నియోజకవర్గంలోని 50 గ్రామాలు తిరిగి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆమె అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో త్వరితగతిన తూకం వేసి ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో రైతులకు డబ్బులు వారి బ్యాంకు ఖాతాలో వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ రైతు బాన్సువాడ మహిపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సారా రామా గౌడ్, మాజీ సి డి సి చైర్మన్ చిలుముల దుర్గారెడ్డి, రాజీవ్ రెడ్డి, పోల నవీన్, వెల్మకన్య సర్పంచ్ కుమ్మరి శివ లీల సతీష్, తోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,ఆయా గ్రామాలకు చెందిన రైతులు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తాండూర్‌లో అక్రమ సెల్లార్ తవ్వకం

- కమిషనర్ తక్షణ చర్య
- టౌన్ ప్లానింగ్ అధికారిపై లంచం ఆరోపణలు
- మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సంగీత అజయ్ సింగ్ ఠాకూర్

**తాండూరు, మే 12 (జనంసాక్షి) :** మున్సిపల్ పరిధి వార్డ్ నెంబర్ 20, గాంధీనగర్‌లోని ఇంటి నం. 6-8-61/16 డి బ్యాక్ సైడ్ ఫ్లాట్‌లో మున్సిపల్ అనుమతి లేకుండా చేపట్టిన డబుల్ సెల్లార్ తవ్వకాన్ని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో మంగళవారం జేసీబీతో పూడ్చివేశారు.

### అసలేం జరిగింది

30 ఏప్రిల్ 2026న అక్రమంగా డబుల్ సెల్లార్ తవ్వకం ప్రారంభమైంది. దీనివల్ల పక్కనే ఉన్న ఇళ్ల బేస్‌మెంట్లు కదిలి మట్టి, రాళ్లు జారడం మొదలైంది. ప్రమాదాన్ని గుర్తించిన మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సంగీత అజయ్ సింగ్ ఠాకూర్ రాజేశ్వరి సక్కుబాయి పురుషోత్తం వెంటనే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.



### ఆరోపణలు...

ఫిర్యాదు అందినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి వారం రోజులు పట్టించుకోలేదని, పైగా ప్రజాప్రతినిధులతో కలిసి లంచం డిమాండ్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో 11 మే నాడు, బాధితులు నేరుగా కమిషనర్‌ను కలిసి అక్రమ తవ్వకంతో పాటు భూపతిపై కూడా ఫిర్యాదు చేశారు.

### కమిషనర్ మదుసుదన్ రెడ్డి స్పందన

ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన కమిషనర్, మంగళవారం ఉదయాన్నే మున్సిపల్ జేసీబీని పంపించి ప్రమాదకరంగా తవ్విన గుంతను పూర్తిగా పూడ్చించారు.

### ప్రజల హర్షం...

“నా ఐదేళ్ల కౌన్సిలర్ పాలనలో ఇలాంటి కమిషనర్‌ను చూడలేదు. ప్రజా సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించిన ఆయన ‘ద బెస్ట్ కమిషనర్’. ఆయన చేసిన ప్రజాసేవకు తలవంచి నమస్కరిస్తున్నాను” అని సంగీత అజయ్ సింగ్ కొనియాడారు.

### డిమాండ్...

అదే సమయంలో లంచం డిమాండ్ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారి భూపతిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. “అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలి తప్ప, ప్రజాప్రతినిధులతో చేతులు కలిపి ప్రజలను ఇబ్బంది పెడుతూ లంచాలు అడగొద్దు” అని ఆమె హెచ్చరించారు.

### తదుపరి చర్యలు

అక్రమ తవ్వకం వల్ల నష్టపోయిన పక్క ఇళ్లకు స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, భూపతిపై శాఖాపరమైన విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

## అనుములలో విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**హాలియా, మే 12 (జనం సాక్షి) :** అనుముల మండల కేంద్రంలోని అధీకృత విత్తన దుకాణాలు మరియు విత్తన గోదాములపై మండల విత్తన తనిఖీ బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. స్థానిక తహసీల్దార్ బి. చందర్ రావు, ఎస్సై సాయి ప్రశాంత్, మండల వ్యవసాయ అధికారి ఎం. వెంకన్న సమక్షంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర వ్యవసాయ కేంద్రం, సాగర్ రోడ్డులోని శ్రీ లక్ష్మీ ప్రసన్న సంస్థలలో పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. గోదాముల్లో నిల్వ ఉంచిన విత్తన సంచులు, నిల్వ వివరాలు, వివిధ సంస్థల బిల్లులు, నాణ్యత ప్రమాణాలను అధికారులు తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని దుకాణదారులకు సూచించారు. ఎరువుల కొనుగోలు, విక్రయాలలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా అధికారిక రసీదులు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.



# విపణి

## ఐటీ స్టాక్స్‌కు ఓపెన్‌ఏఐ షాక్..

**ఐటీ ఇండెక్స్ 3% పతనం**



**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొం టున్నాయి. బెంచ్ మార్క్ సూచీలు 1 శాతానికి నష్టాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల వల్ల సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా ఓ దశలో 3.7 శాతం మేర నష్టపోయింది. 2023 మే తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన ఏఐ సంస్థ ఓపెన్‌ఏఐ కొత్త కంపెనీని ప్రకటించడం ఇందుకు నేపథ్యం. శామ్‌ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ సంస్థ కొత్తగా 'ఓపెన్ ఏఐ డిప్లాయ్‌మెంట్ కంపెనీ'ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 4 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ఏఐ సిస్టమ్స్‌తో నిర్వహించుకోవడం దీని ఉద్దేశం. దీంతో సంప్రదాయ ఐటీ సర్వీస్ కంపెనీల వ్యాపారానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది నేటి ట్రేడింగ్ సెషన్‌లో ప్రతిఫలించిందని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.7 శాతానికి పైగా నష్టంతో దాదాపు 1000 పాయింట్లకు పైగా కోల్పోయి 28,300 స్థాయికి పడిపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్‌లోని అన్ని స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్ ఐదు శాతం మేర పతనం కాగా.. టీసీఎస్, ఎల్‌టీఎం, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, కోఫోర్జ్ సైతం 2-4 శాతం మేర నష్టోయాయి.

## క్లాడ్ మిథోస్‌కు పోటీగా..'డేబ్రేక్'

అడ్వాన్స్‌డ్ హ్యాకింగ్ సామర్థ్యాలున్న 'క్లాడ్ మిథోస్' టూల్‌ను ప్రకటించిన ఆంత్రోపిక్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. దీనికి పోటీగా ఓపెన్ ఏఐ సంస్థ 'డే బ్రేక్'ను తీసుకువచ్చింది ఈ విషయాన్ని సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "డే బ్రేక్‌ను లాంచ్ చేశాం. సైబర్ సెక్యూరిటీ విషయంలో ఏఐ ఇప్పటికే గొప్పగా పనిచేస్తోంది. భవిష్యత్‌లో మరింత అద్భుతంగా మారబోతోంది. కంపెనీలు తమను తాము నిరంతరం సురక్షితంగా ఉంచుకోవడంలో వారికి సహాయపడేందుకు, వారితో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని రాసుకొచ్చారు. క్లాడ్ మిథోస్ అనేది ఆంత్రోపిక్ తయారుచేసిన అత్యంత శక్తిమంతమైన ఏఐ టూల్. వ్యవస్థలో సైబర్ భద్రతా లోపాలను పసిగట్టడంలో ఇది చాలా చురుగ్గా పనిచేస్తుంది. దీని సామర్థ్యం ఎంతలా ఉందంటే.. నిపుణులు సైతం గుర్తించలేకపోయిన దాదాపు 27 ఏళ్ల నాటి పాత ఆపరేటింగ్ సిస్టమ్‌లు, వెబ్ బ్రౌజర్లలోని లోపాలను ఇది ఇట్టే పసిగడుతుంది. అత్యున్నత కోడింగ్ సామర్థ్యాలున్న ఈ టూల్, ఆపరేటింగ్ సిస్టమ్‌లలోని సైబర్ భద్రతా లోపాలను కనుక్కోవడమే కాకుండా, వాటి ద్వారా ఎలా దాడి చేయాలో కూడా కొత్త మార్గాలను స్వయంగా అభివృద్ధి చేయగలదు. ఇది సామాన్యులకు అందుబాటులోకి వస్తే, చేతిలో ల్యాప్‌టాప్ ఉన్న ప్రతిఒక్కరికీ అత్యున్నత హ్యాకింగ్ ఆయుధాలను అందించినట్లేనని భావించి, ఆంత్రోపిక్ దీన్ని ప్రజల కోసం విడుదల చేయలేదు.

# రూ.10 లక్షల కోట్లు ఆవిరి

## భారీ నష్టాల్లో సూచీలు..



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాల నడుమ వరుసగా నాలుగో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపాయి. దీనికితోడు ప్రధాని మోదీ పొదుపు చర్యలు ప్రకటించడం, ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం 'లైఫ్ సపోర్ట్' మీద ఉందంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం వంటివి మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 23,400 దిగువకు చేరింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులోనే రూ.10 లక్షల కోట్లు క్షీణించి రూ.457 లక్షల కోట్లకు చేరింది. రోజంతా నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 75,688.39 (క్రితం ముగింపు 76,015.28) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 74,449.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1456 పాయింట్ల నష్టంతో 74,559.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 436 పాయింట్ల నష్టంతో 23,379.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.63 వద్ద జీవనకాల కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క ఎస్‌బీఐ మినహా మిగిలిన కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, టైటాన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవే..**

పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఏడాది పాటు బంగారం కొనొద్దంటూ ప్రధాని చేసిన సూచనలు వినియోగ ఆధారిత రంగాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీర్ఘకాలంలో వృద్ధి మందగించొచ్చన్న భయాలు సూచీలను ప్రభావితం చేశాయి. శాశ్వత శాంతి కోసం టెహ్రాన్ పంపిన తాజా ప్రతిపాదనను డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించడంతో పాటు అది తమకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు మరోసారి విఫలమవ్వడం, యుద్ధ భయాలు నెలకొనడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్ 100 డాలర్ల ఎగువన స్థిరంగా కొనసాగుతుండడం భారత ఆర్థిక వ్యవస్థపై భారాన్ని పెంచుతోంది. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుందనే భయం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో 95.63 వద్దకు పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూపాయి సుమారు 6 శాతం మేర క్షీణించింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాల కొనసాగుతుండడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

## ఉపగ్రహ ప్రయోగాల్లో మస్క్ రికార్డు

**ప్రపంచమంతా ఒకవైపు.. ఈ ట్రిలియనీర్ ఒకవైపు!**

**వాషింగ్టన్:** ఈ భూమిపై మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ పని చేస్తోంది. అంతరిక్షయాన చరిత్రలో ఈ సంస్థ త్వరలో ఓ అద్భుతమైన మైలురాయిని చేరుకునేందుకు సిద్ధమైంది. 1957లో అంతరిక్ష యుగం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం ప్రపంచ దేశాలు, సంస్థలు అన్నీ కలిపి 15,062 ఉపగ్రహాల (రాజీబివశ్రీశ్రీతిబివబ)ను కక్ష్యలోకి ప్రయోగించగా.. ఒక్క స్పేస్ ఎక్స్ మాత్రమే 14,844 శాటిలైట్లను ప్రయోగించడం విశేషం. మరో 200 శాటిలైట్లను మస్క్ సంస్థ అంతరిక్షంలోకి ప్రయోగిస్తే.. ప్రపంచంలోనే అత్యధిక ఉపగ్రహాలు ప్రయోగించిన సంస్థగా చరిత్ర సృష్టిస్తుంది. తన ప్రయోగ సామర్థ్యాన్ని మరింత గణనీయంగా పెంచే లక్ష్యంతో స్పేస్‌ఎక్స్ ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్ వ్యవస్థ అయిన 'స్టార్‌షిప్'ను కూడా అభివృద్ధి చేస్తోంది. అయితే, ఈ శాటిలైట్లు ఓవైపు గ్లోబల్ ఇంటర్నెట్ కనెక్టివిటీలో విప్లవాత్మక పురోగతికి శ్రీకారం చుడుతూనే.. మరోవైపు విశ్వ పరిశోధనలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఖగోళ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కక్ష్యలో స్టార్‌లింక్ ఉపగ్రహాల సంఖ్య పెరుగుతుండటంతో ఇవి బ్లాక్ హోల్‌లు, సుదూర గెలాక్సీలపై చేపట్టే పరిశోధనలపై ప్రభావం చూపిస్తున్నాయని.. కక్ష్య రద్దీ, అంతరిక్ష శిథిలాలు వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,39,950 | ₹ 1,52,680 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,74,900

**హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో తొలిసారి..**

## టాటా ఆల్ట్రోజ్



**న్యూఢిల్లీ:** ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టాటా మోటార్ పాసింజర్ వెహికల్ 5 స్పీడ్ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ తో కూడిన ఆల్ట్రోజ్ సీఎన్ వేరియంట్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధరను రూ.8.7 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో సీఎన్‌జీ, ఏఎంటీ ఆప్షన్‌తో వస్తున్న తొలి కారు ఇదే కావడం గమనార్హం. అంతేకాదు ఈ సెగ్మెంట్‌లో డీజిల్ ఇంజిన్ ఆప్షన్ అందిస్తున్న కారు కూడా ఇదే. టాటా ఆల్ట్రోజ్ సీఎన్‌జీ వేరియంట్‌లో పెట్రోల్ వెర్షన్ తరహాలోనే 1.2 లీటర్ త్రీ సిలిండర్ ఇంజిన్ ఇచ్చారు. ఫ్యాక్టరీ ఫిటెడ్ ట్విన్ సిలిండర్ సెటప్ ఉంది. సీఎన్‌జీ మోడ్‌లో 73.5 హెచ్‌పీ పవర్‌ను, 103 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పెట్రోల్ మోడ్‌లో 88 హెచ్‌పీ, 115 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అయితే, పెట్రోల్, డీజిల్ వెర్షన్లతో పోలిస్తే ఇందులో బూట్‌స్పేస్ తక్కువగా ఉంటుంది. పెట్రోల్ వెర్షన్‌లో 345 లీటర్ల బూట్‌స్పేస్ ఇవ్వగా.. ఇందులో 210 లీటర్ల బూట్ స్పేస్ మాత్రమే లభిస్తుంది. టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ఆప్షన్లలో లభిస్తుండగా.. నగర ప్రయాణికుల కోసం కొత్తగా ఏఎంటీ వేరియంట్‌ను లాంచ్ చేశారు. అంటే టూ పెడల్ డ్రైవింగ్ కోరుకునే వారికి ఇది సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందులో డీఆర్‌ఎల్స్‌తో కూడిన కనెక్టెడ్ ఎల్‌ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్ ఇచ్చారు. క్యాబిన్ లోపల 26.03 సెంటిమీటర్ల డిజిటల్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది ఇన్ఫోటైన్మెంట్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కోసం ఉపయోగపడుతుంది. సాఫ్ట్ టచ్ డ్యాష్‌బోర్డ్, యాంబియంట్ లైటింగ్, లాంజ్ స్టయిల్ రియర్ సీట్లు ఈ కారు ప్రత్యేకత. భారత్ ఎన్‌క్యాప్ పరీక్షల్లో 5 స్టార్ రేటింగ్ పొందిన ఈ కారులో ఆరు ఎయిర్ బ్యాగులున్నాయి. హైఎండ్ వేరియంట్లలో 360 డిగ్రీల కెమెరా, టైర్‌ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో హెడ్‌ల్యాంప్స్, ఎల్‌ఈడీ ఫాగ్ ల్యాంప్స్ వంటివి లభిస్తాయి.

# ఒత్తిడి వద్దు... సోదరా!

## ఒత్తిడిలో పడితే అన్నీ మఠాషే..



**న్యూఢిల్లీ:** మనిషికి ఒత్తిడి వల్ల ఎదురయ్యే అనర్థాలెన్నో... లెక్కలేనన్ని మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయి చివరకు సంతానోత్పత్తి సామర్థ్యమూ దెబ్బతింటుంది వీర్యకణాల సంఖ్యను, బలాన్ని కుదించేస్తుంది. అందుకే ఒత్తిడి వద్దు... సోదరా! అధిక ఒత్తిడి వల్ల సంతానోత్పత్తి సమస్యలూ వస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వీర్యకణాల సంఖ్య పడిపోవడానికి, అవి బలహీనంగా కదలడానికి- అధిక ఒత్తిడి స్థాయిలతో సంబంధం ఉందని పరిశోధనలు తేల్చాయి. పురుషులు నిరంతరం ఒత్తిడికి లోనవడం వీర్యకణాల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జామిన్ బ్రహ్మభట్ అంటున్నారు. ఒత్తిడి వల్ల.. శరీరం చేసే పనుల తీరు తెన్నులే మారిపోతాయి. ఒత్తిడి కలిగినప్పుడు, శరీరం కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లను విడుదల చేస్తుంది. ఒత్తిడి సమయాల్లో మనం స్పందించడానికి సహాయపడే శరీర అంతర్నిర్మిత హెచ్చరిక వ్యవస్థలో ఇదో భాగం. స్వల్పకాలంలో ఇది మంచిదే. కానీ ఒత్తిడి వారాలు, నెలల పాటు కొనసాగినప్పుడు నిద్ర దెబ్బతింటుంది. శక్తి తగ్గిపోతుంది. మానసిక స్థితి మారుతుంది. బరువు పెరుగుతాం. లైంగిక వాంఛ తగ్గిపోతుంది. కొందరు దుర్వ్యసనాలకు అలవాటు పడతారు. దీనివల్ల సంతానోత్పత్తి సమస్యల్ని ఎదుర్కొంటారు. శుక్రకణాలు ఉత్పత్తి అయి, పరిపక్వం చెంది, వీర్యంలో కనిపించడానికి సుమారు రెండు, మూడు నెలల సమయం పడుతుంది. దీర్ఘకాలిక అలసట, నిద్రలేమి.. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచుతాయి. ఇది శుక్రకణాలను నేరుగా దెబ్బతీస్తుంది. అధిక ఒత్తిడి స్థాయిలు శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం, అవి బలహీనంగా కదలడం, సరైన ఆకారం లేకపోవడం వంటి వాటికి దారితీస్తాయని పరిశోధనలు తేల్చాయి. దాదాపు 1,200 మందికి పైగా పురుషులపై జరిపిన ఓ అధ్యయనంలో- మధ్యస్థాయి ఒత్తిడి ఉన్న వారితో పోలిస్తే అధికస్థాయి ఒత్తిడి ఉన్నవారిలో వీర్యకణాల సాంద్రత, సంఖ్య బాగా తక్కువగా ఉన్నట్లు తేలింది.

**ఏం చేయాలి?**

ఒత్తిడి ఎందువల్ల కలుగుతుందో తొలుత గుర్తించాలి. తగినంతగా నిద్రపోతున్నారా? శారీరకంగా చురుకుగా ఉంటున్నారా? ఎక్కువగా మద్యం తాగుతున్నారా? మాదకద్రవ్యాలు వాడుతున్నారా? ఇత్యాది అంశాల్ని విశ్లేషిస్తే వారు ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో గుర్తించొచ్చు. డిజిటల్ వ్యాపకం మనలో విపరీతమైన ఒత్తిడి భావనలు కలగజేస్తుంది. చాలావరకు దానికి బానిస కాకుండా చూసుకోవాలి. నిద్ర టెస్టోస్టిరోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. వీర్య కణాల వృద్ధికి టెస్టోస్టిరోన్ చాలా అవసరం. అందువల్ల 7 నుంచి 9 గంటలు నిద్రపోవడం మంచిది. క్రమం తప్పని శారీరక శ్రమ హార్మోన్ల నియంత్రణకు, కార్టిసాల్‌ను తగ్గించడానికి, ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోవడానికి సహాయపడుతుంది. జిమ్‌లో కఠినంగా వ్యాయామం చేయడం కంటే శరీర నిరంతర కదలికలు ముఖ్యం. అధిక బరువు పురుషుల్లో ఈస్ట్రోజెన్ స్థాయిల్ని పెంచుతుంది, ఇది టెస్టోస్టిరోన్‌ను అణచేసి, వీర్య కణాల ఉత్పత్తిని ప్రేరేపించే హార్మోన్ల సంకేతాలకు అంతరాయం కలిగిస్తుంది. అందువల్ల బరువు తగ్గించుకోవడం మంచిది. నికోటిన్, గంజాయి, అధిక ఆల్కహాల్ ఇవన్నీ వీర్యకణాలు తగ్గిపోవడానికి, బలహీనమైన చలనానికి, అసాధారణ కణ ఆకృతులకు కారణమవుతాయి. వీటిని తగ్గించుకోవడం మన చేతుల్లో ఉంటుంది. దీర్ఘకాలిక ఒత్తిడి శరీరాన్ని బలహీనపరుస్తుంటే, దాని ప్రభావం సంతానోత్పత్తి సామర్థ్యంపై పడొచ్చు. అందువల్ల ఒత్తిడి కారణాలను గుర్తించి, అది పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. సంతాన ప్రాప్తిరస్తు!

**ఇరాన్ సైనిక విమానాలు..**

## రహస్యంగా పాక్‌లో పార్కింగ్..!

అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ గురించి తాజాగా సంచలన విషయాలు బయటకు వచ్చాయి. ఇటీవల జరిగిన ఘర్షణల సమయంలో ఇరాన్ సైనిక విమానాలను తమ ఎయిర్‌ఫీల్డ్‌లలో నిలిపి ఉంచేందుకు పాక్ రహస్యంగా అనుమతించిందట. ఈ మేరకు అమెరికా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్ సైనిక ఆస్తులతో సహా అనేక విమానాలు రావల్పిండిలోని పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ (ఔబీతీ ఇష్ట్రజీని ఎజీబవ)లో నిలిపిఉంచినట్లు వెల్లడించాయి. లాక్‌హీడ్ సి-130 హెర్క్యులస్ రవాణా విమానం, ఇరాన్ వైమానిక దళానికి చెందిన ఆర్‌సీ-130తో సహా పలు విమానాలు ఇక్కడ ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల నుంచి తమ వైమానిక, సైనిక ఆస్తులను రక్షించుకోవడంలో భాగంగా ఇరాన్ ఇలా చేసి ఉండవచ్చని ఆ కథనాలు పేర్కొన్నాయి. దీంతో పాటు టెహ్రాన్‌కు చెందిన ఓ పౌర విమానాన్ని కూడా అఫ్గానిస్థాన్‌లో నిలిపిఉంచినట్లు వెల్లడించాయి. పాకిస్థాన్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు ఈ కథనాలను ఖండించారు. నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ ప్రజలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతంలో ఉందన్నారు. కాబట్టి ఇలాంటి కార్యకలాపాలు అక్కడ రహస్యంగా జరగడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఘర్షణ ప్రారంభం కావడానికి ముందు మహాన్ ఎయిర్‌కు చెందిన ఒక ఇరాన్ పౌర విమానం కాబుల్‌లో దిగిందని అఫ్గాన్ (ంటణప్త్రజీనితిబబిజీని) పౌర విమానయాన అధికారి తెలిపారు. ఘర్షణల కారణంగా ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసిన నేపథ్యంలో.. అది అక్కడే ఉండిపోయిందన్నారు. అఫ్గాన్‌లో ఇరాన్ విమానాలు ఉన్నాయనే వార్తలను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తోసిపుచ్చారు. విమానాలను తరలించాల్సిన అవసరం ఇరాన్‌కు లేదన్నారు. కాగా.. యూఎస్ సెనెటర్ లిండ్సే గ్రాహం కూడా ఎక్స్ వేదికగా దీనిపై స్పందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడత జూన్ 2 నుంచి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని అన్నారు.

## తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్ర కోసం కూంబింగ్ కొన సాగుతున్న క్రమంలో.. నరహరి తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి కాగా.. అతని భార్య ఏపీకి చెందిన మహిళగా సమాచారం. 1996 నుంచి అజ్ఞాతంలో ఉన్న నరహరి పలు కీలక ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మిసిర్ బెస్ర కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.

**మావోయిస్టుల రహస్య స్థావరం..**

**- 1.64 కోట్ల నగదు స్వాధీనం**

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టుల రహస్య స్థావరాన్ని గుర్తించాయి. 'మాద్ బచావో అభియాన్' కింద డీఆర్జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భారీగా నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఎస్పీ రాబిన్సన్ గుడియా ధ్రువీకరించారు. మొత్తం రూ.1.64 కోట్ల నగదు, మూడు ఏకే-47 రైఫిళ్లు, మూడు ఎస్‌ఎల్‌ఆర్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు సహా భారీగా ఇతర ఆయుధాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వందలాది తూటాలు, మ్యాగజైన్‌లు, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, వాకీ-టాకీ సెట్లు ఉన్నాయి. జిల్లాను మావోయిస్టు రహితంగా మార్చేందుకు ఇలాంటి ఆపరేషన్లు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

## పసిడి కొనుగోళ్లు మానేస్తే 3.5 కోట్ల మంది ఉపాధికి ముప్పు

**పీయూష్ గోయల్‌కు ఏఐజేజీఎఫ్ లేఖ**

దిల్లీ: దేశీయంగా నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని సమీకరించడం, దానిని పునర్వినియోగంలోకి తేవడం ద్వారా విదేశీ మారక ద్రవ్య సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆల్ ఇండియా జువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ (ఏఐజేజీఎఫ్) అభిప్రాయపడింది. విదేశీ మారక నిల్వలను కాపాడేందుకు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలన్న సూచనలు దేశవ్యాప్తంగా దాదాపు 3.5 కోట్ల మంది ఉపాధికి ముప్పుగా పరిణమిస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఫెడరేషన్ సోమవారం ప్రకటన విడుదల చేసింది. విదేశీ మారక నిల్వలను కాపాడుకునే చర్యల్లో భాగంగా పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలని ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు వాయిదా వేయడం కాకుండా దేశీయ పసిడి సమీకరణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని ఏఐజేజీఎఫ్ కోరింది. ఈ విషయమై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఏఐజేజీఎఫ్ జాతీయ అధ్యక్షుడు పంకజ్ అరోరా లేఖ రాశారు. 'పెరుగుతున్న దిగుమతుల బిల్లు, విదేశీ మారక నిల్వలపై ప్రభుత్వ ఆందోళన అర్థం చేసుకోదగినదే. దానికి పరిష్కారం పసిడి గిరాకీని తగ్గించడం కాదు. దీనివల్ల ఆభరణాల తయారీ రంగం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. వినియోగదారుల ఆలోచనా ధోరణిలో అకస్మాత్తుగా వచ్చే ప్రతికూల మార్పుల వల్ల ఆభరణాల దుకాణాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య తగ్గడమే కాకుండా, తయారీ ఆర్డర్లు మందగిస్తాయని ఫెడరేషన్ హెచ్చరించింది. దీనివల్ల సరఫరా వ్యవస్థలో అత్యంత కీలకమైన చిన్న తరహా ఆభరణాల వ్యాపారులు, చేతివృత్తుల వారి ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇది కేవలం పసిడి వ్యాపారానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, జీవనోపాధి సమస్య అని తేల్చిచెప్పింది. ప్రభుత్వానికి ఏఐజేజీఎఫ్ కీలక ప్రతిపాదనలు: బంగారం కొనుగోళ్ల తగ్గింపునకు బదులుగా పలు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని ఏఐజేజీఎఫ్ ప్రభుత్వానికి సూచించింది. దేశీయంగా బంగారాన్ని సమీకరించడానికి ప్రత్యేక బులియన్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. గోల్డ్ ఈటీఎఫ్‌లు తమ వద్ద ఉన్న భౌతిక నిల్వల్లో 20-30 శాతాన్ని నియంత్రిత వ్యవస్థ ద్వారా రుణాలుగా ఇచ్చేందుకు అనుమతించాలని కోరింది. 2015లో ప్రారంభించిన ప్రభుత్వ గోల్డ్ మానిటైజేషన్ పథకం కొన్ని లోపాల కారణంగా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదని, దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సూచించింది. రుణాలకు పూచీకత్తుగా ఉపయోగపడే డీమెటీరియలైజ్డ్ బులియన్ డిపాజిట్ సర్టిఫికెట్లను తీసుకురావడం, అంతర్గత పసిడి బదిలీలపై పన్ను, జీఎస్‌టీ తీసేయడం, పసిడి సమీకరణ, దిగుమతుల ప్రత్యామ్నాయాన్ని గుర్తించేందుకు జాతీయ డాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయడం వంటి ఇతర ప్రతిపాదనలను చేసింది.



# డబ్బులిచ్చి రోగాలను కొంటున్నాం


## రంగు రంగుల ప్లాస్టిక్ కవర్లతో పిల్లల ఆకర్షణ

- **రసాయనాల తయారీ వల్ల తీవ్రరోగాల పాలు**
- **ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ ముప్పు**
- **కన్నెత్తి చూడని ఫుడ్ సేఫ్టీ అధికారులు**
- **గద్వాల జిల్లాలో పెరిగిపోతున్న విషపు చిరుతిండ్ల దుకాణాలు**

**రాజోలి, మే 12(జనంసాక్షి) :** పసిపిల్లలు ఏడుపు ఆపాలంటే చిరుతిండ్లు, స్కూలుకు వెళ్లాలంటే కురుకురేలు, బజారుకు వెళ్తే ఫాస్ట్ ఫుడ్ పదార్థాలు అలా మానవ జీవితంలో పసిపిల్లలకు చిన్నతనం నుంచి చిరుతిండ్లను అలవాటు చేసి డబ్బులు ఇచ్చి మరి రోగాలను కొనితెచ్చుకుంటున్నాం. ప్రస్తుతం సమాజంలో చదువుకున్న తల్లిదండ్రులు సైతం పిల్లల ఏడుపు మాన్పియడానికి, తమ జోలికి రాకుండా ఉండటానికి విషపు ఆహారాన్నినే పసిపిల్లలకు అందిస్తున్నాం. ఇదే అదునుగా ఎటువంటి అనుమతులు లేని నాణ్యత కూడా కరువైన చిరు ఆహారాలను జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా కేంద్రాలు ఏర్పాటు చేసి పసి పిల్లలని కేంద్ర బిందువుగా ఉంచుకొని రకరకాల రంగురంగుల ప్యాకెట్లలో చిరుతిండ్లు తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్లో అమ్మకాలు చేస్తూ కోట్ల రూపాయలు దోచుకుంటున్నారు. కానీ తల్లిదండ్రుల అవగాహన రాహిత్యంగా పసిపిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు.

**చిన్న వయసులోనే జబ్బులు**

చదువుకున్న తల్లిదండ్రులే అవగాహన లేకుండా పసిపిల్లలకు రంగురంగుల ప్యాకెట్లలో విషపు చిరుతిండ్లు, కురుకురేలు, నాణ్యతలేని ఐస్క్రీములు, రసాయనాతో కూడిన శీతల పానీయాలను అందిస్తూ పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేని కేంద్రాలు, అడ్రస్ లేని కంపెనీలు ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లలో నిల్వచేసిన విషపు పదార్థాలను అమ్మకాలు చేస్తూ కోట్లలో లాభాలు గడిస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు కన్నెత్తి చూడని దుర్మార్గ పరిస్థితి. దీంతో పసిపిల్లల్లో ఊబకాయం, థైరాయిడ్, మధు మేహం, గుండె వ్యాధులు మొదలుకొని క్యాన్సర్ వ్యాదులకు బలి అవుతున్నారు. ఈ ఆహార మాఫియాపై అధికారులు చర్యలు తీసుకోకపోతే నేటి చిన్నారులు రేపటి జీవితం ఘోరమై ఆరోగ్య సమస్యలతో నిండిపోనుందని వైద్యులు హెచ్చరిస్తూ తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



**నాసిరకం నూనెల వినియోగం**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు మల్దకల్,



శాంతినగర్, అలంపూర్, అయిజ, ఎర్రవల్లిలో స్వీట్స్ స్టాల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.
ఇతర ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో యథేచ్ఛగా నాసిరకం నూనెలను వినియోగించడమే కాక వాడిన నూనెలను పలుమార్లు మరిగించి మరిగించి నిబంధనలను పక్కన పెడుతున్నారు. ఒకసారి వాడిన వంట నూనెను రెండు సార్లకంటే ఎక్కువగా వాడకూడదు. ఎక్కువసార్లు నూనెను మరిగిస్తే అందులోని రసాయన, పోషక, ఇంద్రియ లక్షణాల్లో మార్పులు రావడం వల్ల బిపి పెరిగి గుండె, కాలేయం వ్యాధులు ఉత్పన్నం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. వాడిన మరిగిన నూనె రోజుల తరబడి ఆహార పదార్థాల తయారీలో వాడుతుడడం తో వినియోగదారులకు పలు ఆనారోగ్యం బారిన పడుతున్నారు.

**ఆహారంలో కలుస్తున్న ప్లాస్టిక్**

వేడి ఆహారం ప్లాస్టిక్ డబ్బాల్లో, కవర్లలో వెయ్యడం వల్ల ఆ రసాయనాలు ఆహారంలో కలిసి క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. పొగలు కక్కుతున్న వేడివేడి ప్లాస్టి క్ కవర్లో బిర్యానీ, చికెన్, సాంబారు వంటివేడి పదార్థాలను సన్నటి మందం కవర్లలో ఇస్తున్నారు.




మధ్యాహ్నం భోజనం వంటి ఏ ఆహారమైనా ఎంత వేడిగా ఉన్నా ఎవరూ ఆలోచించడం లేదు. పేపరు ప్లేట్ల పేరుతో ప్లాస్టిక్ పూత కలిగినవే ఎక్కువ వాడుతున్నారు. ఇది సులువుగా ఆహారంలో కలిసి క్యాన్సర్ కు దారితీస్తున్నాయి. వాడిన మరిగిన నూనె రోజుల తరబడి ఆహార పదార్థాల తయారీలో వాడుతుడడంతో వినియోగదారులకు పలు ఆనారోగ్యం బారిన పడుతున్నారు.

**ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కరువు**

జిల్లాలో అనుమతులు లేకుండానే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా.. ఆహారభద్రతాశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పలువురు నిర్వాహకులు నాసిరకమైన వస్తువులను వంటకాల్లో వాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఓ హోటల్ ఏర్పాటు చేయాలంటే ఆహారభద్రతశాఖ జారీ చేసే ఫుడ్ లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలి. జిల్లాలో చాలా హోటల్ నిర్వాహకులు వీటిని పాటించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధితధికారులు హోటల్లోపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**వ్యాధులను ఆహ్వానించినట్లే**

నోటికి రుచిగా ఉంటుందని ఎక్కువ శాతం ప్రజలు ఫాస్ట్‌ఫుడ్‌ని ఇష్టపడుతున్నారు. వాటిలో వివిధ రకాల రసాయనాలు కలిపి చేయడం వల్ల ఆనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం, డయాబెటిస్, కొలెస్ట్రాల్ పెరిగి గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. వీటికంటే కూడా ఇంట్లో తయారుచేసిన ఆహారం, తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు, ప్రొటీన్ అధికంగా ఉన్న ఫుడ్ తీసుకోవాలి. కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన జ్యూస్‌లకు బదులుగా నీరు ఎక్కువగా తాగండి.

**-గద్వాల జిల్లా వైద్యాధికారి, సంధ్యా కిరణ్మయి**

### బస్టాండ్ నుంచి ఆసుపత్రికి..

# గర్భిణులు, బాలింతలకు ఉచిత ప్రయాణం

**బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి**




**కొల్లాపూర్/నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతల రవాణా కష్టాలు తీరనున్నాయి. వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణం (బస్టాండ్) నుంచి రామాపురం శివారులో ఉన్న మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి వెళ్లేందుకు రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి.. ప్రత్యేక చొరవ తీసుకుని ఈ వాహనాన్ని సమకూర్చారు. హైదరాబాద్‌కు చెందిన 'గుడ్ యూనివర్స్' సామాజిక సేవా సంస్థ, 'ఆర్సేసియం' సంస్థల సహకారంతో ఈ పర్యావరణహిత వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఈ ఉచిత రవాణా సౌకర్యం ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. సురక్షితమైన, సులభతరమైన ప్రయాణాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన సేవా సంస్థలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనుష్క, వంశీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్లు తరలించండి మహాప్రభో రైతుల రాస్తారోకో



**శివ్వంపేట మే 12 జనంసాక్షి :** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేను వెంటనే రైస్ మిల్ కు పంపించండి, మహాప్రభో అంటూ మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల, చెన్నాపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు చిన్నగొట్టిముక్ల చౌరస్తాలోని తూప్రాన్ - నర్సాపూర్ ప్రధాన రహదారి పై మంగళవారం రాస్తారోకో చేపట్టారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న బీఅర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ వారి ఆందోళన కు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల వడ్లు కొనుగోలు కేంద్రల వద్దకు గత 20 రోజులుగా ఒక్క లారీ కూడా రాలేదని వాపోయారు. అధికారులు రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని దుయ్యాబట్టారు. రైతుల రాస్తారోకో తో తూప్రాన్ నర్సాపూర్ రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు ఆగిపోవడం జరిగింది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అధికారులతో మాట్లాడి వెంటనే అధికారులను ధర్నా కార్యక్రమం వద్దకు పంపించడం జరిగింది. ఈ మూడు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించకపోతే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని రమణ గౌడ్ హెచ్చరించారు. ఘటన స్థలానికి తాసిల్దార్ కమలాద్రి వచ్చి నచ్చజెప్పడంతో రైతులు వారి ఆందోళనను విరమించారు.

# బెట్టింగ్‌ల మోజులో బ్యాంకుకు కన్నం వేసిన ఘనుడు

- **రూ.1.80 కోట్లు లూటి.. ఆదర్శ బ్యాంకును ఆగం చేసిన భార్యభర్తలు**
- **పోలీసులకు చిక్కిన భార్య...పరారీలో భర్త**

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 12 (జనం సాక్షి ):** మెదక్‌లో సంచలనం బెట్టింగ్ మోజులో పడి మెదక్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ బ్యాంకులో భార్యభర్తలు మరో ఇద్దరితో కలిసి రూ.1.80కోట్లు లూటి చేసిన సంఘటన మంగళవారం రోజున మెదక్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించింది. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్‌లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాకు చెందిన యాదం అనిల్ మెదక్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అనిల్ బెట్టింగ్ మోజులో నిండి మునిగిపోయాడు. దీంతో బెట్టింగ్‌ల కోసం మేనేజర్ అతని భార్య స్రవంతితో పాటు అతని స్నేహితుడు సుబ్రహ్మణ్యం లకు సంబంధించిన ఆధార్, పాన్‌కార్డులపై బ్యాంక్‌లో నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో లోన్‌లు తీసుకున్నాడు. అలాగే రెండు ఏటీఎంల నుండి డిపాజిట్ చేసే సమయంలో కొంత కొంత డబ్బులు పక్కన బెడుతూ ఇలా రూ.31.35 లక్షల నగదును కూడా మోస పూరితంగా బ్యాంకును మోసం చేసి వాడుకున్నాడు. ఇతనికి బ్యాంకులో బంగారాన్ని పరిశీలించే వ్యక్తి శ్రీనివాసచారి సహకరించిన ట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మేనేజర్ యాదం అనిల్‌తోపాటు అతని భార్య స్రవంతి, అతని స్నేహితుడు సుబ్రహ్మణ్యం, సహకరించిన శ్రీనివాసచారిలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

అనిల్ గతంలో కూడా ఆంధ్ర ప్రదేశ్ వెలైపాడు పీఎస్ పరిధిలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ నందు పొలవరం నిర్వాసితులను, గిరిజనుల సైతం మోసం చేసి రూ.11.82,487 డబ్బులు వాడుకొని జైలు పాలయ్యాడు. ప్రస్తుతం మేనేజర్ అనిల్ పరారీలో ఉండగా అతని భార్య స్రవంతి, శ్రీనివాసచారి, సుబ్రహ్మ ణ్యంలను అరెస్ట్ చేసి కోర్టునందు హాజరు పర్చినట్లు డీఎస్పీ తెలిపారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ నేపథ్యంలో కలెక్టర్ సూచనల మేరకు తనిఖీ

**సిరికొండ, మే 12 (జనంసాక్షి):** డిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు ఝాటోత్ హుస్సేన్ నాయక్ పాకాల గ్రామ సమస్యలపై విచారణ జరిపిన నేపథ్యంలో నిజామాబాద్ కలెక్టర్ సూచనల మేరకు అధికారులు పాకాల గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అదనపు కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో డీవైహెచ్ఓ, పీఆర్ఏఈ, ఆర్‌డబీ ఏఈ, జెడ్పీ సీఈఓ, ఎంఆర్ఓ, ఎంపీడీఓ తదితర శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి స్థానికులతో సమావేశం నిర్వహించారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందిం చాలని, ఆ శాఖ ఏఈ హర్షిత్‌ను పిలిచి నీటి సమస్యను తీర్చాలని సూచించారు. గ్రామంలోని మిగిలిన సమస్యలపై మూడు రోజుల్లో రిపోర్టు అందించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రోడ్లు, పాఠశాల వసతులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో హాకీ క్రీడల్లో రాణించడం అభినందనీయం : పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ క్రైం మే 12: జనం సాక్షి :** నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రతిభావంతురాలు, జాతీయ స్థాయిలో ఐదుసార్లు హాకీ క్రీడల్లో పాల్గొని జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన మాలవత్ మమతను నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి . సాయి చైతన్య సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి జాతీయ స్థాయిలో ఐదుసార్లు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గొప్ప విషయమని, మాలవత్ మమత వంటి క్రీడాకారిణులు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షిస్తూ, ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , ధర్పల్లి సిఐబి భిక్షపతి, సిరికొండ ఎస్ఐజె రామకృష్ణ, నిజామాబాదు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్ విశాఖ గంగారెడ్డి, సెక్రటరీ రమణ, హాకీ కోచ్ నగేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తి చేయాలి

### సమస్యలున్న కేంద్రానికి ప్రత్యేక పర్యవేక్షణ బృందం

**ప్రతి సెంటర్లో టార్పాలిన్ ఉండాలి..అదనపు నిల్వ కేంద్రాలు గుర్తించాలి :జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**

**కరీంనగర్ బ్యూరో, మే 12 (జనంసాక్షి) :** అధికారులు సమన్వయంతో పని చేస్తూ ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబందిత అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా అన్ని కేంద్రాల్లో నూరు శాతం టార్పాలిన్ ఉండాలని ఆదేశించారు. అత్యధికంగా ధాన్యం సేకరించాల్సిన కేంద్రాల సమీపంలో తాత్కాలిక స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ వేగం పెంచాలని మార్క్ఫెడ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఏడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు వేగవంతం చేయాలని, ఎక్కువ మొత్తంలో ధాన్యం సేకరణకు వస్తే జిల్లాలో ధాన్యం నిల్వచేసేందుకు అదనపు నిల్వ కేంద్రాలను గుర్తించాలన్నారు.

**ప్రత్యేక బృందం సంయుక్త పర్యవేక్షణ**

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రతి కేంద్రానికి ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల, రెవిన్యూ, పోలీస్, రవాణా శాఖల అధికారులతో పాటు ప్రత్యేక అధికారి ఈ బృందంలో ఉంటారని తెలిపారు. ఈ బృందం సభ్యులు ప్రతిరోజు కొనుగోలు కేంద్రంలో సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్డీవో రమేష్ బాబు, పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్ పాల్గొన్నారు.

# మైనింగ్ మాయాజాలం

- **ఎస్వి కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ నుండి అక్రమంగా మట్టి తరలింపు**
- **పోలీసులు లారీలను పట్టుకున్నాక వే బిల్లులు జనరేట్ చేసిన మట్టి మాఫియా**




**ఇబ్రహీంపట్నం రూరల్, మే 12 (జనం సాక్షి) :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను ఇబ్రహీంపట్నం (బ్లూకార్ట్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం హయత్ నగర్ లో ఎస్వి కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ నుండి ఇబ్రహీంపట్నం వైపు మట్టి లోడుతో వస్తున్న టూ07ఖ9855, టూ07ఖజు0599 గల రెండు టిప్పర్ లారీలను మంగళ్ పల్లి చర్చ్ వద్ద నిలిపి, లారీ డ్రైవర్లను అడగగా ఎలాంటి అనుమతులకు సంబంధించిన పత్రాలు తమ వద్ద లేవని చెప్పారు. దీంతో లారీలను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ తరలిస్తుండగా, మార్గం మధ్యలో మళ్లీ అనుమతులు ఉన్నాయంటూ వేబిల్ లు వాట్సప్ చేసి ఇదిగో అనుమతులు అంటూ చూపించారు. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. పోలీసులు లారీలను పట్టుకున్నప్పుడు లేనివే బిల్లులు, తప్పించుకోవడం కోసం చేసిన ప్రయత్నంలో భాగంగా.. అప్పటికప్పుడు మైనింగ్ లాగిన్ నుంచి వే బిల్లులను జనరేట్ చేసి, వాట్సప్ చేశారు. లారీలను పోలీసులు పట్టుకున్నప్పటికీ సమయం మధ్యాహ్నం 01.01 నిమిషాలు. మైనింగ్ లాగిన్ నుంచి జనరేట్ అయిన వేబిల్ లో సమయం మధ్యాహ్నం 01:05 నిమిషాలు. అంటే ఇక్కడ పోలీసులు పట్టుకున్న తర్వాతే లారీలకు వే బిల్లులు ఇవ్వడం జరిగింది. అయితే ఈ వే బిల్లులు బ్లూకార్ట్ పోలీసులకు చూపించి మట్టి మాఫియా మట్టి లారీలు పోలీస్ స్టేషన్ కు వెళ్లకముందే ఎలాంటి కేసు కాకుండా జాగ్రత్తపడుతూ తెలివిగా తప్పించుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డుపై మట్టి తరలిస్తూ ఇటు పోలీసులను, అటు మైనింగ్ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న మైనింగ్ మాఫియా పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మేరు కార్పొరేషన్ ఏర్పాటు కల నెరవేరింది

- **మేరు కులస్తుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా**
- **నిజామాబాద్ కార్పొరేషన్ చైర్మన్ సంఘు వెంకట్ రాజం**




**నిజామాబాద్ అర్బన్ మే 12: జనం సాక్షి :** గత 20 సంవత్సరాల నుండి మేరు కులానికి కార్పొరేషన్ ఏర్పాటు కోసం గత ప్రభుత్వలకు ప్రధాన డిమాండ్ గా విన్నవించుకున్నప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో మేరు కులానికి కార్పొరేషన్ ప్రకటించడంతో మేరు కులస్తుల నెరవేరిందని చైర్మన్ గా సంఘు వెంకట్ రాజం, వైస్ చైర్మన్ గా మాడిశెట్టి లక్ష్మినారాయణలు తెలిపారు. నిజామాబాద్ మేరు భవనంలో నూతనంగా నియమింపబడిన చైర్మన్, వైస్ చైర్మన్ లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సోమ హన్మంత్ రావు సభా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటరాజం మాట్లాడుతూ మేరు కులానికి ఫెడరేషన్ ఏర్పాటు చేస్తూ, 50 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు యావత్ తెలంగాణ రాష్ట్ర మేరు కులస్థుల పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లాలోని,అన్ని పట్టణ,మండల కార్యవర్గాలు, నిర్మల్ జిల్లా,కామారెడ్డి జిల్లా, జగిత్యాల జిల్లా కార్యవర్గాలు, పక్క రాష్ట్రమైన మహా రాష్ట్రంలోని,ముంబై, పూణే,నాందేడ్ అధ్యక్ష కార్యవర్గాలు హాజరై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేరు కులస్తుల సమస్యలపై డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ఉచితంగా బీసీ మహిళలకు నియోజకవర్గం నకు 1000 కుట్టు మిషన్ ల పంపనిలో కనీసం 50 శాతం మేరు కుల మహిళలకు అందే విధంగా చూడాలి. రజక,నాయి బ్రాహ్మణ దుకాణాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత కరెంటు వసతిని మేరు కుల వృత్తి దుకాణాలకు కూడా వర్తింప చేయాలన్నారు. ప్రభుత్వం బట్టలు కుట్టించే ప్రతి విభాగంలో యూనిఫాంలలో కాంట్రాక్టు లను మేరు కులస్థులకు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై చైర్మన్ స్పందించి మూడు డిమాండ్లు తప్పకుండ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సోమ హన్మంత్ రావు తో పాటు నగర మేరు సంఘం అధ్యక్షులు వెన్ను దేవానంద్, జిల్లా ఉపాధ్యక్షులు కొట్టూర్ చంద్రకాంత్, జిల్లా కోశాధికారి కొక్కు రాజేశ్వర్ ,జిల్లా సంయుక్త కార్యదర్శి గట్ల నరేందర్, తాళ్ల నర్సింలు, నగర ఉపాధ్యక్షులు పుట్టకోట పాండు,కొట్టూర్ సురేష్, నగర సంయుక్త కార్యదర్శి రాచర్ల అరుణ్ చంద్,తాళ్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

**శంషాబాద్, మే 12 (జనంసాక్షి):** శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో గత రెండు రోజులుగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆకస్మిక తనిఖీలు చేపట్టడం సంచలనం సృష్టించింది. తనిఖీల్లో పలు అనుమానాస్పద అంశాలు వెలుగుచూశాయి. ఏసీబీ డీసీపీ ఆనంద్ మంగళవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు, అధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా తహసీల్దార్ రవీందర్ దత్ వాహనంలో రూ.60 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ వద్ద రూ.29 వేల నగదు, సర్వేయర్ వద్ద రూ.10 వేల నగదు లభించాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంబంధిత ఫైల్‌ను తొలగించే ప్రయత్నం చేయగా అడ్డుకొని ఫైల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శంషాబాద్ మండల పరిధిలోని కొన్ని భూముల వ్యవహారాల్లో అనుమానాస్పదంగా, నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు డీసీపీ ఆనంద్ తెలిపారు. భూ రికార్డులు, పాస్‌బుక్కు, మ్యూటేషన్ ప్రక్రియలు, భూముల అనుమతుల విషయంలో అక్రమాలు జరిగి ఉండొచ్చనే అనుమానంతో సంబంధిత ఫైళ్లను సేకరించి లోతుగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.
ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, ఫైళ్లు, అధికారిక పత్రాలు, డిజిటల్ రికార్డులను పరిశీలిస్తున్నామని, పూర్తి స్థాయి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేస్తామని తెలిపారు. భూముల వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలు బయటపడటంతో సాధారణ ప్రజలు పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

## నియామకం పట్ల 2008 డీఎస్సీ టీచర్ల హర్షం



హైదరాబాద్ (జనంసాక్షి) : అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2008 డీఎస్సీ అభ్యర్థులు 1175 మందికి ఉపాధ్యాయులుగా నియమించిన ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆ ఉపాధ్యాయులు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో 2008 డిఎస్సి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. 17 సంవత్సరాలుగా టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమకు చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగాలు ఇచ్చి ఆదుకున్నారని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పోస్టింగ్స్ ఇచ్చారని, అయితే కొత్త జిల్లాల ప్రాతిపదికల పోస్టింగ్స్ మార్చాలని వారు సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సర్వీస్ సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చిన్నారెడ్డి వారికి హామీ ఇచ్చారు.

**సీఎం ప్రజావాణిలో 393 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 221వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 393 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 190, రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇందిరమ్మ ఇండ్ల కోసం 97, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి చైర్మన్ అంబాసడర్ బీ.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి

- మహిళల సాధికారతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జీవనోపాధి కార్యక్రమాలు, ఆర్థిక స్వావలంబన చర్యలు ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా వారోత్సవాల కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ప్రతి రోజు భిన్న రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలను చాటి చెప్పే విధంగా షెడ్యూల్ రూపొందించాలన్నారు. కనీసం 4 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకు స్థాపన జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ దానకిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యుల విజయగాథలను ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, మహిళల నాయకత్వ వికాసం, సామాజిక మార్పు వంటి అంశాలను ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం చేతుల మీదుగా మహిళా సాధికారత, మహిళా విజయాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, వ్యవసాయ, అనుబంధ, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 63 లక్షలకు పైగా మహిళలు స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములై ఉన్నారని, దేశంలోనే అతిపెద్ద మహిళా ఆధారిత అభివృద్ధి వ్యవస్థగా తెలంగాణ నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల క్రెడిట్ లింకేజ్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత రెండేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజ్ సాధించడం ద్వారా మహిళల ఆర్థిక భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. వ్యక్తిగత మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వడ్డీ లేని రుణాల పథకం ద్వారా పేద కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తోందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ హయంలో నిలిచిపోయిన వడ్డీ లేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 4.38 లక్షల సంఘాలకు రూ.1400 కోట్లు విడుదల చేసి దాదాపు 48 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ మొత్తాన్ని రెట్టింపు చేస్తామని వెల్లడించారు. మహిళా సంఘ సభ్యులకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లోన్ భీమా', 'ప్రమాద భీమా' పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని మంత్రి తెలిపారు. సభ్యురాలి మరణం సంభవించినప్పుడు రూ.2 లక్షల వరకు రుణ భీమా రక్షణ అందిస్తున్నామని, ఇప్పటివరకు 2,993 క్లెయిమ్‌లకు రూ.23.72 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రమాద మరణాలపై రూ.10 లక్షల భీమా అందించే ప్రమాద భీమా పథకం కింద 228 క్లెయిమ్‌లకు రూ.22.28 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళల ఆధ్వర్యంలో 2.36 లక్షల సూక్ష్మ వ్యాపార యూనిట్లు ఏర్పాటు కావడం ద్వారా రూ.4,166 కోట్లకు పైగా ఆర్థిక కార్యకలాపాలు జరిగాయని మంత్రి వివరించారు. జిల్లా సమాఖ్యల కోసం రూ.110 కోట్లతో 22 ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 222 క్యాంటీన్లు ఒక్కో యూనిట్‌కు నెలకు సగటున రూ.72 వేల లాభం ఆర్జిస్తూ 4 నుంచి 5 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి బజార్ ద్వారా మహిళా వ్యాపారవేత్తలకు మార్కెట్ అవకాశాలు విస్తరించాయని, 106 రిటైల్ దుకాణాల ద్వారా కోట్ల వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల సమాఖ్యలు రూ.200 కోట్ల పెట్టుబడితో 593 బస్సులను కొనుగోలు చేసి నిర్వహిస్తున్నాయని, ఒక్కో బస్సు ద్వారా నెలకు సగటున రూ.69 వేలకుపైగా ఆదాయం వస్తోందని వివరించారు. గత ఏడాది 3195 వరి కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలు నిర్వహించి రూ.158 కోట్ల కమిషన్ ఆర్జించాయని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకులు నెలకు రూ.6 నుంచి 7 లక్షల వరకు ఆదాయం సాధిస్తున్నాయని, మొదటి యూనిట్ ఆరు నెలల్లోనే రూ.13.82 లక్షల లాభం సాధించిందని చెప్పారు. మరో 30 పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసం, సామాజిక భద్రత, డిజిటల్ సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను మహిళా వారోత్సవాల ద్వారా ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

## గోడౌన్‌లో మంటలు చెలరేగి వాహనాలు దగ్ధం




సంగారెడ్డి, మే12 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

- సనాతన ధర్మంపై నోరు పారేసుకున్న డిఎంకె నేత
- ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత



చెన్నై, మే 12 (జనంసాక్షి) : తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. తాజాగా, మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

# నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్



వరంగల్, మే12 (జనంసాక్షి) : జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వెట్ ల్యాండ్స్ నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోని వెట్‌ల్యాండ్స్ (చెరువులు, నీటి వనరులు) పరిరక్షణ, వాటి అధికారిక నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం ఆమె అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వెట్‌ల్యాండ్స్ పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వెట్‌ల్యాండ్ (కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్) రూల్స్–2017 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఏసీ అట్లాస్‌లో గుర్తించిన 12,249 వెట్‌ల్యాండ్స్‌పై గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 4,023 వెట్‌ల్యాండ్స్‌కు సరిహద్దుల నిర్ధారణ పూర్తైందని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వేలను వేగంగా పూర్తి చేసి "బ్రీఫ్ డాక్యుమెంట్స్" సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. జిల్లా వెట్‌ల్యాండ్ అథారిటీల నుంచి ఖచ్చితమైన నివేదికలు వచ్చేలా శాఖల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రధాన వెట్‌ల్యాండ్స్ సహా 28 ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు సమావేశంలో వెల్లడించారు. ఇవి త్వరలో గెజిట్ నోటిఫికేషన్, ప్రజాభిప్రాయ సేకరణ దశలకు వెళ్లనున్నట్లు తెలిపారు. మంజీరా వన్యప్రాణి అభయారణ్యాన్ని అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన రామ్‌సార్ సైట్‌గా గుర్తింపు పొందేందుకు పంపిన ప్రతిపాదనపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఇరిగేషన్ శాఖ వద్ద తుది అభిప్రాయాల కోసం ఉందని, అనంతరం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణలో నిపుణుల అభిప్రాయాలు, శాస్త్రీయ అధ్యయనాలు కీలకమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విజయవంతమైన నమూనాలను పంచుకోవడంతో పాటు స్థానిక స్థాయిలో కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వెట్‌ల్యాండ్స్‌లో ఆక్రమణలు, ఘన వ్యర్థాల పారవేత, శుద్ధి చేయని మురుగు నీటి విడుదల వంటి కార్యకలాపాలు 2017 నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధించబడినవని మంత్రి స్పష్టం చేశారు.

# తరుగు, తేమ పేరుతో దోపిడీ

- రైతు ఆందోళనకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మద్దతు

మెదక్, మే12 (జనంసాక్షి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ, తరుగు పేరుతో రెండు కిలోలకు పైగా అదనంగా తీసుకుంటున్నారని, దీన్ని వెంటనే నిలిపియాలని నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం లారీల సమస్య, హమాలీల సమస్యను వెంటనే పరిష్కరించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే శివంపేట మండలం చిన్న గొట్టిముక్కల చౌరస్తా వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రైతులను బుజ్జగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

- బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
- తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
- చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్




హైదరాబాద్, మే12 (జనంసాక్షి) : స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370